
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు



మాట్లాడుతున్న ఆర్‌డీవో రాణిసుస్మిత, ఆనంద తీర్థాచార్యులు

అక్టోబరు 27న గోదావరి మాతకు మహా నీరాజనం

కొవ్వూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అక్టోబరు 27వ తేదీన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గోదావరిమాతకు మహా నీరాజనం వైభవోపేతంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు టీటీడీ. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనందతీర్థాచార్యులు తెలిపారు.కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం కార్తీక గోదావరి నీరాజనం ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షించారు. కార్తీకమాసం సోమవారం గోష్పాదక్షేత్రంలో టీటీడీ నుంచి తీసుకువచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వివిధరకాల పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అఖండ గోదావరిమాతకు మహానీరాజనం అందజేస్తామన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ గోదావరి మహానీరాజనానికి అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు.



జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కీర్తి చేకూరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టుఆవరణలో శుక్రవారం సాయంత్రం జిల్లా జడ్జిని కలిసి మొక్కను అందించారు.జిల్లాకు సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు.



న్యాయం కావాలి!

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్‌ఏ)ఆధ్వర్యంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు.ఐఎల్‌ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ , రాజమహేంద్రవరం బార్ అధ్యక్షుడు కొత్తూరి ఆనందకుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఈ నిరసనలో సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



లేఖర్ల పెన్‌డౌన్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేసి నిరసన ప్రదర్శన చేశారు. రాజమహేంద్రవరంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.2.0 రిజిస్ట్రేషన్ విధానం వల్ల ప్రజలు, దస్తావేజు లేఖర్లకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లేఖర్ల జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, కోలా రామచంద్రరావు పాల్గొన్నారు.



పెద్ద ప్లానింగే!

అంతస్తుల్లో అధనపు మడత

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

అక్రమ నిర్మాణాలు అధికారుల కళ్లకు కనిపించవు. కాసులు వారి కళ్లకు గంతలు కట్టేస్తాయి. వాణిజ్య భవనాలు/సముదాయాల విషయంలో కిక్కురుమనడంలేదు.అందుకే మూడు నిర్మాణాలు ఆరు కాసులు అనే చందంగా సాగి పోతున్నాయి. అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తుల భవనాలకు బీపీఎస్ వరంగా మారింది. అద నపు అంతస్తుల క్రమబద్ధీకరణపై యజమానుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. అధికారులు మాత్రం అదనంగా అవకాశాన్ని అందిపుచ్చుకొనే 'ప్లానింగ్' చేశారు. ఈ అంతస్తుల మడతపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

ఉమ్మడి తూర్పులో ఎన్నో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్లు, అమలాపురం మునిసిపాలిటీ. ఉమ్మడి జిల్లాలో 9 మునిసిపాలిటీలు, రెండు మునిసిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో రాజమహేంద్రవరం ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉంది. గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు పెద్దగా ఉండవు. కానీ నగర పంచాయతీలు, నగర పాలక సంఘాలు, మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో అయితే మరీ ఎక్కువ సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటారు. ఉమ్మడి జిల్లాలో గ్రామాలను మినహాయిస్తే కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురాల్లోని 2.5 లక్షలకుపైగా భవనాలు ఉండగా వాటిలో 50 శాతం వాణిజ్య భవనాలు /అపార్టుమెంట్లు ఉంటాయి. వీటిలో చాలా వరకూ అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు సమాచారం. మూడేళ్ల కిందట అక్రమ అంతస్తుల విషయంలో నోటీసులు జారీ చేశారు. తర్వాత వందల కొలదీ నిర్మాణాలు జరిగాయి. వాటికి నోటీసులు ఇస్తున్నామని అధికారులు చెప్పడమే గానీ ఒరిగింది ఏమిటనేది టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎప్పుడూ పెద్ద ప్రశ్నే. ఉదాహరణకు రాజమహేంద్రవరం నగర పాలకసంస్థ పరిధిలో మూడేళ్ల కిందట 150 అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు. అంతకు పదింతలు అక్రమ అంతస్తులు ఉంటాయనే విషయం బహిరంగ రహస్యం. ఆ నోటీసుల్లో కూడా ఎక్కువగా చిన్న వాళ్లే ఉన్నారు. ఆ నోటీసుల సంగతి ఏమైందో ఇప్పటికీ తెలియదు. ఆరోపణలు ఉన్న వాళ్లు కొందరు టౌన్ ప్లానింగ్‌కి బాధ్యులుగా ఉండడంతో 'యథా రాజా తథా ఉద్యోగి' అనే చందంగా పరిస్థితి తయా రైంది. ప్రభుత్వం క్రమబద్ధీకరణ నిర్ణయంతో వీళ్లంతా దాదాపుగా ఎగిరి గంతేసినంత పని చేశారు. అధికారులు మాత్రం యథావిధిగా కాసుల వేట 'ప్లానింగ్' చేసేశారు. అసలు ఉమ్మడి తూర్పులో ఎన్ని భవనాల్లో అక్రమంగా అంతస్తులు నిర్మించారో కూడా లెక్క పక్కాగా లేకపోవడం గమనార్హం.

- పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు
- సహకరిస్తున్న అధికారులు
- చూసీచూడనట్టు వదిలేసి
- ఇష్టారాజ్యంగా నొక్కుడు
- ప్రతిదానికి పక్కాగా రేటు
- జేబు నింపుకుంటున్న ప్లానింగ్
- వేల సంఖ్యలో భవనాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- భారీగా ముడుపులు
- వరంగా మారిన బీపీఎస్

అంతస్తుల మడత ఇలా

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఆగస్టు 31కి పూర్తి చేసుకున్న భవనాలు/అపార్టుమెంట్లకు మాత్రమే బీపీఎస్ వర్తిస్తుంది. దీంతో ఆ తేదీకి ముందు నిర్మాణం పూర్తి చేసుకున్నట్టు పాత తేదీలను వేసి మేనేజ్ చేస్తున్నారు. ఈ మేరకు బీపీఎస్‌కి, అదపు అంతస్తు నిర్మాణంలో విషయంలో కళ్లు మూసుకోడానికి వేర్వేరుగా వసూళ్లు చేస్తున్నారు.

కట్టేయండి.. ఇచ్చేయండి..



బీపీఎస్ కింద క్రమబద్ధీకరించడానికి ప్రభు త్వం ఫీజుల మాట ఎలా ఉన్నా.. ఇంత అం టూ టౌన్/సిటీ ప్లానింగ్, కొందరు కమిషనర్లు నోటిమాట ధరలు పెట్టేసుకున్నారు. 100 మీటర్ల లోపు విస్తీర్ణంలోని భవనాల్లో అదనంగా నిర్మిం చే ఒక్కో అంతస్తుకు రూ.1-2 లక్షలు, 300 వరకూ ఉంటే రూ.3-4 లక్షలు, 500 వరకూ రూ.4-6 లక్షలు, అపార్ట్‌మెంట్ అయితే ఏకంగా ఫ్లోరుకు రూ.10-15 లక్షలు ముడుపులు పుచ్చు కుంటున్నారు. ఉమ్మడి తూర్పులో రాజమహేం ద్రవరం, కాకినాడలో.. ప్రధానంగా రాజమహేం ద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో అపార్టుమెంట్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. నిర్మాణంలో ఉన్నవే వందకుపైగా ఉంటాయి. ఇప్పుడు వాటికి ఫ్లోర్లు అదనంగా నిర్మించుకోవడానికి ఎలాంటి ప్రక్రియా లేకుండా బీపీఎస్ కింద ఫీజు చెల్లించి, అధికారులకు అనధికార ఫీజు చెల్లిస్తే పనైపోతుంది.ఆ ఫ్లోరులో ప్లాట్లు నిర్మించి ఎంచక్కా అమ్మేసుకోవచ్చు. నగరపాలక సంస్థల ను అనుకొని ఉన్న పంచాయతీల పరిధిలో కూడా ఈ తంతు సాగుతోంది.

అక్రమాలకు తెరతీశారు..

స్థానిక సంస్థల నుంచి అనుమతులు తీసు కున్న వాటికంటే అదనంగా చేపట్టిన అంతస్తుల (నిర్మాణాలు)ను బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్) కింద క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.ఇదే అదనుగా ఇప్పటికే నిర్మిస్తున్న భవనాల్లో అక్రమంగా నిర్మాణాలకు తెరతీశారు.అధికారులకు కాస్త ఎక్కువగా చేయి తడిపితే పాత తేదీలతో గట్టెక్కిస్తారనే గ్యారంటీ ఉండడంతో ఇటీవల అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సక్రమంగా ఉంటే వచ్చే మామూలు కంటే అక్రమ నిర్మాణా లకు అద నంగా ఉంటుందని కొన్ని చోట్ల అధికా రులే ఐడియా ఇచ్చి అక్రమ అంతస్తులకు చేయూతనిస్తున్నారని తెలుస్తోంది. ఈ తంతు నడపడానికి కిందిస్థాయి సిబ్బందిని నియమిం చుకోగా బాగానే దండుకుంటున్నారని చెబుతున్నారు.

బీపీఎస్‌కు 4న కేబినెట్ ఆమోదం

బీపీఎస్‌ని ఈ నెల 4న కేబినెట్ ఆమోదించింది. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి నిర్మాణాలు పూర్తయిన వాటికి ఈ వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతకుముందే దీనిపై ఉప్పందడంతో రెండు నెలల ముందు నుంచీ అక్రమ నిర్మా ణాలు విపరీతంగా జరుగుతున్నాయి. సాధార ణంగా సామాన్యుడి ఓ ఇంటి నిర్మాణ అను మతికి దరఖాస్తు చేస్తే ఆ ఫైలు కదలడానికి ముక్కుతూ మూలుగుతూ ఉంటుంది. కానీ అదనపు అంతస్తుల క్రమబద్ధీకరణ ఫైళ్లు మాత్రం దూసుకుపోతున్నాయి. ఉమ్మడి తూర్పులోని రాజమహేంద్రవరంలోనే ఎక్కువగా బీపీఎస్ కిందకు వస్తున్న అంతస్తులు ఉండడంతో సిటీ ప్లానింగ్ అధికారుల పంట పండుతోందని ఆ శాఖలో చర్చ నడుస్తోంది.

అసెంబ్లీలో మన వాణి!







అసెంబ్లీ వర్షాకాల సమావేశంలో రెండో రోజు శుక్రవారం మన ఎమ్మెల్యే తమ వాణి వినిపించారు.. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అసెంబ్లీలో మాట్లాడారు.. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీఎంను కలిసి సమస్యలు విన్నవించారు.

పెద్దేవంలో పశువులు మృత్యువాత

కొవ్వూరు, సెప్టెంబరు 19(ఆంధజ్యోతి): తాళ్లపూడి మండలం పెద్దేవంలో పాడి పశువులు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతున్నాయని.. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి పాడి రైతులను ఆదుకోవాలి. కొవ్వూరు నియోజకవర్గంలో పశుసంవర్ధకశాఖకు భవనాలు, డాక్టర్లు, సిబ్బంది కొరత అధికంగా ఉంది. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి పాడి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి. దీనిపై స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పశుసంవర్ధకశాఖలో ఖాళీలను భర్తీ చేస్తాం. 6137 మంది వెటర్నరీ అసిస్టెంట్స్ ఉన్నారు. ఎక్కడా పశు వైద్యానికి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశాం. 434 కొత్త ఆసుపత్రులు, మరమ్మతులకు గురైన ఆసుపత్రులకు మరమ్మతులు చేయడానికి నాబార్డుకు ప్రతిపాదనలు పంపాం.

- ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు

జీఎస్టీ 2.0 సూపర్ ఆలోచన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పన్నుల మినహాయింపులపై ఎప్పటికప్పుడు సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు కేంద్రానికి సూచనలు చేయడం రాష్ట్రానికి గర్వకారణం. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు జీఎస్టీ 2.0 ఎంతగానో దోహదం చేస్తుంది. దేశంలో అస్తవ్యస్తంగా ఉన్న పన్నుల వ్యవస్థను సంస్కరించి జీఎస్టీ విధానాన్ని తీసుకొచ్చి ప్రధాని మోదీ గొప్పవిధానానికి నాంది పలికారు..ఇప్పుడు మరిన్ని సంస్కరణలతో 2.0 తీసుకురావడం అభినందనీయం. ఈ విధానంపై దేశంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత అవసరమైన వస్తువులు, ఆరోగ్యం, విద్య సంబంధిత వస్తువులకు జీరో రేటుకి తీసుకురావడం అదే సమయంలో లగ్జరీ గూడ్స్‌కి పన్ను పెంచడం అభినందనీయం.

- ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం

గత పాలనలో అవినీతిపై విచారణ జరిపించాలి

దివాన్‌చెరువు/కోరుకొండ, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీఎం చంద్రబాబునాయుడును కోరారు. అమరావతిలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే బత్తుల శుక్రవారం కలిసి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై చర్చించినట్టు చెప్పారు. 586 ఎకరాల ఆవభూముల కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని టీటీడీ దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. కోరుకొండ రంగనాథస్వామి ఆలయం పునర్నిర్మించాలని, పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములో భూములు కోల్పోయిన 92 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం

ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ వినతులు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ తదితర కేసుల కారణంగా సస్పెండ్ అయిన ఉద్యోగులపై విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఉద్యోగుల సమస్యలపై 28 వినతులు స్వీకరించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేం దుకు కృషి చేస్తామన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే కేసుల్లో ప్రధాన శిక్షలు ,తక్కువ ప్రాముఖ్యత ఉంటే చిన్న శిక్షలు విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.



జక్కంపూడి రాజా ఇంటి వద్ద వైసీపీ నాయకుల నిరసన ప్రదర్శన

గ్రూపులుగా వైసీపీ చలో మెడికల్ కాలేజీ


రాజమహేంద్రవరం/అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ చలో మెడికల్ కాలేజీకి కార్యక్రమంలోనే వైసీపీ గ్రూపులతో వ్యవహరించడం ఆ పార్టీ పరిస్థితికి అద్దంపడుతోంది. రాజమహేంద్రవరం వైసీపీలో రెండు గ్రూపుల వ్యవహారం మళ్లీ రోడ్డెక్కింది. చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి మాజీమంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇచ్చిన పిలుపులో జక్కంపూడి రాజా ఇంటి నుంచి శుక్రవారం ఉదయం 9 గంటలకు చలో మెడికల్ కాలేజి మొదలవుతుందని ఉంది. మాజీ ఎంపీ మార్గాని భరత్ వర్గం క్వారీమార్కెట్ నుంచి ఉదయం 9 గంటలకు ఛలో మెడికల్ కాలేజి మొదలవుతుందని పిలుపు ఇచ్చారు. పైగా పస్తుతం కాలేజీలో ఫైనల్ పరీక్షలు జరుగుతున్న కారణంగా విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని వైసీపీ నేతలకు పోలీసులు ముందుగానే నోటీసులు ఇచ్చారు.వైసీపీ పార్లమెంటరీ నాయకుడు డా. గూడూరి శ్రీనివాసరావు, అజ్జరపు వాసు తదితరులు కొంత మందితో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేసి వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటి వద్ద రోడ్డుపై మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, రౌతు సూర్య ప్రకాశరావు, డా.గూడూరి శ్రీనివాసరావు, మేడపాటి షర్మిళారెడ్డి, జక్కంపూడి గణేష్, నందెపు శ్రీనివాస్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. చివరకు ఎవరూ మెడికల్ కాలేజీ వరకూ చేరకుండా నిరసన ముగిసింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. వైసీపీ శ్రేణుల నుంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను చేపట్టారు. డీఎస్పీ భవ్యకిషోర్ మెడికల్ కాలేజీ వద్దకు చేరుకుని భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. త్రీ టౌన్ సీఐ వి.అప్పారావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ మంగాదేవి, పలువురు ఎస్‌ఐలు, సిబ్బందితో మెడికల్ కాలేజీ వద్ద పహరా ఉన్నారు. డ్రోన్ కెమెరాను మెడికల్ కాలేజీ పరిసరాల్లో ఎగుర వేసి పరిస్థితిని పోలీసు అధికారులు సమీక్షించారు. చివరకు వైసీపీ శ్రేణులు మెడికల్ కాలేజీ వద్దకు రాకపోవడంతో భద్రత ఉపసంహరించారు.



గేదెలకు.. ఆ వ్యాధేంటో!

పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధి

రాజమహేంద్రవరం/తాళ్లపూడి/కొవ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాడి గేదెలకు ఆ వ్యాధేంటో.. ఉన్నట్టు ఉండి తిండితినడం మానేస్తున్నాయి. కుప్పకూలిపోతున్నాయి. వాస్తవానికి గత నెల 24న నుంచి అంతుచిక్కని వ్యాధితో 10 పాడి గేదెలు మృతిచెందాయి. మరో 22 గేదెలకు వ్యాధి లక్షణాలు ఉన్నాయి. అందులో మరో 15 వ్యాధి సోకిన గేదెలను అమ్మేశారు. మరో ఏడు గేదెలకు చికిత్స చేస్తున్నారు. ఇదీ కొవ్వూరు నియోజకవర్గం పరిధి తాళ్లపూడి మండలం పెద్దేవంలో పరిస్థితి.. ప్రస్తుతం అది కొవ్వూరు మండలంలోని పంగిడి గ్రామానికి పాకింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పశువైద్యులు అప్రమత్తమయ్యారు.



నీటి నమూనాలు సేకరణ

పెద్దేవం గ్రామంలో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. గేదెల వరుస మరణాల దృష్ట్యా పెద్దేవం గ్రామానికి వచ్చిన కలెక్టరు చేకూరి కీర్తి గ్రామంలో ఎక్కడెక్కడ గేదెలు తాగుతున్నాయో అక్కడ ఉన్న నీటని పరీక్షించాలని ఆదేశాలిచ్చారు.దీంతో అధికారులు ఆయా ప్రదేశాల్లో నీటిని సేకరించి పరీక్షలు చేపట్టారు.

జిల్లాలో అప్రమత్తం

పెద్దేవంలో గేదెలు మృతి, పంగిడిలో రెండు గేదెలకు వ్యాధి లక్షణాలు కనిపించడంలో జిల్లా అంతటా అప్రమత్తం చేశారు. పెద్దేవంలో 10 గేదెలు మృతి చెందగా, 15 గేదెలకు వ్యాధి సోకిన సంగతి తెలిసిందే. కానీ అక్కడ రైతులు వ్యాధి సోకిన వాటిని కోతకు అమ్మేసినట్టు సమాచారం. వీటి మాంసాన్ని గొడ్డు మాంసం వ్యాపారులు యథేచ్ఛగా అమ్మేస్తుండడం గమనార్హం. అసలు ఈ వ్యాధి లక్షణాలేంటో తేలకుండా గేదెల మాంసం తినడం ప్రమాదకరమే! అందువల్ల వ్యాధి సోకిన గేదెలు అమ్మడం కొనడం చేయకూడదు. వాటి మాంసాన్ని తినడం మంచిది కాదు. ఇదిలా ఉండగా కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో ఇంటింటా సర్వే చేస్తున్నారు. పెద్దేవంలో 360, పంగిడిలో 300 వరకూ గేదెలు ఉన్నాయి. జిల్లాలో లక్షా 69 వేల గేదెలు, 76 వేల ఆవులు, 2లక్షల 41వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఈ మేరకు జిల్లాలోని పశువైద్యశాఖ అధికారులను అప్రమత్తం చేసి ఎక్కడ ఈ లక్షణాలు కనిపించినా సమాచారమివ్వాలని చెబుతున్నారు.గేదెలు మురుగు నీరు తాగకుండా చూసుకోవాలంటున్నారు. రైతులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పెద్దేవంలో సుగంధి చెరువు వినియోగంలో లేదని పేర్కొన్నారు.

- ఆగని గేదెల మరణాలు
- ఇప్పటి వరకూ 10 మృతి
- మరో 15 గేదెలకు లక్షణాలు
- గత నెల 24 నుంచి వ్యాధి
- అయినా కనిపెట్టలేని వైనం
- నీటి నమూనాలు సేకరణ
- పంగిడిలో రెండు గేదెలకు



గేదెల మెడపై తెల్లటి మచ్చలు వస్తే అంతే..

పాడి గేదెల మెడఎడమ వైపు చెవికి మధ్య తెల్లటి మచ్చలు రావడం,గూబ వాచిపోవడం, ఆహారం మానేయడం, కుప్పకూలడం.. ఇవీ లక్షణాలు..ఆగస్టు 24న ఆ లక్షణాలతోనే యండపల్లి విష్ణు మూర్తి గేదె ఆకస్మికంగా మృతి చెం దింది. తర్వాత అదే ఊరిలో పలు గేదెలకు ఇటువంటి లక్షణాలు కనిపించ డంతో రైతులు వైద్యులను సంప్రదించారు. చికిత్స అందించినా 9 గేదెలు మృత్యువా తపడ్డాయి. దీంతో జిల్లా పశువైద్యశాఖ అప్రమత్తమైంది. వైద్యులు గేదెల రక్తం, పేడ, గడ్డి, దాణా, నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపగా పేడ పరీక్షలో బి.కోలి, పొట్ట జలగ వ్యాధి లక్షణాలు ఉన్నట్టు నిర్ధారిం చారు. కానీ వాటికి సంబంధించిన మందులు వాడినా పెద్దగా స్పందన లేదు. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట మరో గేదె మృతిచెందింది. ఈ గేదెకు అక్కడే పోస్టుమార్టం చేయగా పొట్ట,కాలేయం లోనూ జలగలు ఉన్నట్టు గుర్తిం చారు. దీంతో వాటి రక్తంతో పాటు మెడ వద్ద మచ్చభాగంలోని కండను , పేడ, ఇతర అవయవాలను విజయవాడకు చెందిన వీబీఆర్‌ఐ ల్యాబ్ నిపుణు లు తీసుకెళ్లారు.వాటి రిపోర్టు రావడానికి రెండు మూడు రోజులు పడుతుం దని పశుసంవర్ధక శాఖ జేడీ టి. శ్రీనివాసరావు తెలిపారు. తన 30 ఏళ్ల సర్వీసులో ఇటువంటి వ్యాధిని చూడలేదని ఆయన చెప్పడం గమనార్హం.

మూడు గేదెలు చనిపోయాయి..

నాకు నాలుగు గేదెలు ఉన్నాయి. సుగంధి చెరువు సమీపంలో కడతా. నా గేదెలన్నింటికీ వ్యాధి సోకింది. మూడు గేదెలు చనిపోగా ఉన్న ఒక్క గేదెను కాపాడుకోవడానికి వేలాది రూపాయలు మందులకు ఖర్చు చేశా.అయినప్పటికీ గేదె నిలబడడం లేదు. పడుకునే ఉంటుంది. నీళ్లు తాగదు, తిండి తినదు..నీరసించి పోతుంది. ఎప్పుడు చనిపోతుందో తెలియదు.

- జమ్ములు శ్రీను, రైతు, పెద్దేవం

ఒక గేదె చనిపోయింది..

నాకు రెండు గేదెలు ఒక ఆవు ఉన్నాయి. నా గేదెలను ఎక్కడికీ తీసుకెళ్లను.వాటిని ఇంటి వద్దనే మేం తాగే నీళ్లే వాటికి పెడతాం. అయినా ఒక గేదె వ్యాధి సోకి చనిపోయింది. ఉన్న గేదెకు, ఆవుకు ఈ రోజు వాటి పొట్టలో ఏమైనా జలగలు గానీ నత్తలు గానీ ఉంటే చనిపోవడా నికి మందులు వేశారు.ఆవుకు మాత్రం ఏ విధమైన వ్యాధి సోకలేదు.

- జొన్నలగడ్డ సత్యనారాయణ, రైతు



గురువుల.. గోకవరం



మారుమూల మండలం ..30 మంది ఉపాధ్యాయులు

(గోకవరం- ఆంధ్రజ్యోతి)

పట్టుదల ఉంటే కానిది లేదు.. లక్ష్యం ఉంటే సాధించలేనిది లేదని.. సౌకర్యాలేకపోవడం ఆ టంకం కాదని నిరూపించారు.. గోకవరం మండలానికి చెందిన నిరుద్యోగ యువత.. ఎందుకంటే ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఆ ఒక్క మండలం నుంచే సుమారు 30 మంది ఎంపికయ్యారు. శ్రమనే ఆయుధంగా నమ్ముకున్నారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడినా లెక్క చేయలేదు. చివరకు వారు కన్న కలలను సాధించుకున్నారు. మల్లవరం గ్రామం నుంచి సుమారు 30 మంది, రంపయర్రంపాలెం నుంచి 25 మంది డీఎస్సీ పరీక్షకు హాజరుకాగా, మల్లవరం నుంచి 9 మంది, రంపయర్రంపాలెం నుంచి 11 మంది ఎంపికయ్యారు. పలువురిని మొదటి ప్రయత్నంలోనే అదృష్టం వరించగా.. మరికొందరు నాలుగైదు సార్లు ప్రయత్నించి ఉద్యోగాలు సాధించారు.

సర్కారు బడిలో చదివినా..

అది ఒక మారుమూల మండలం.. ఏజెన్సీ సరిహద్దు మండలం.. కార్పొరేట్ స్కూల్స్ అంతగా లేని మండలం.. అయినా ఆ మండలానికి చెందిన అభ్యర్థులు డీఎస్సీలో తమ ప్రతిభ చాటారు.. వారిలో 90 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారే. అయినా ఏకంగా ఒక్క మండలం నుంచే సుమారు 30 మంది వరకూ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మల్లవరం గ్రామం మండల కేంద్రానికి సుమారు 20 కిలోమీటర్లు.. జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. ఆ గ్రామానికి వెళ్లాలంటే అడవిలో ప్రయాణించాల్సిందే. అటువంటి గ్రామం నుంచి ఏకంగా 9 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండల కేంద్రానికి 4 కిలోమీటర్లు దూరంలో ఉండే రంపయర్రంపాలెం నుంచి ఏకంగా 11 మంది డీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు.

- పట్టుదలతో చదివి..సాధించారు
- అంతా సర్కారు బడిలో చదివినవారే
- రంపయర్రంపాలెం నుంచి 11 మంది
- మల్లవరం నుంచి 9 మంది ఎంపిక



విజేతలు వీరే...

మల్లవరం నుంచి ఆడిదం సూరిబాబు, గంటా వీరవిష్ణు, గోకాడ గౌరీదేవి, పడాల రమేష్, ఈడుగుల రాజబాబు,దిమ్మితి శామ్యూల్‌రాజు, మండపాక రాజేశ్వరి, మెరిసే సూర్యం, పల్లెల వీరలక్ష్మి టీచర్లుగా ఎంపికయ్యారు. రంపయర్రంపాలెం నుంచి ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్, బోయిడి సత్యశ్రీ, నవనాసి వీరవిష్ణు, కర్రి సురేష్, నాగవల్లి వెంకటరమ్య, కొండా జయరాందాస్, నాగవల్లి మురళీ శివ బాలకృష్ణ, యామానపల్లి ప్రేమ సౌందర్య, నాగవల్లి శ్రీదేవి, కె.సత్యవతి, గుబ్బల స్వాతి ఎంపికయ్యారు. దేవీపట్నం మండలం పూడిపల్లికి చెందిన దేవిశెట్టి దివ్య ప్రభది పోలవరం పునరావాస కాలనీ. ప్రస్తుతం గుమ్మళ్లదొడ్డిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉంటోంది. 92.04 మార్కులతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 4వ ర్యాంకు సాధించింది.

నాకు వినపడదు.. గోడకు స్పీకర్లు ఏర్పాటు చేసుకుని డీఎస్సీకి ప్రిపర్ అయ్యా..



చాలా కాలం కిందట పొలంలో పాము కాటుకు గురయ్యా. ఆ తరువాత కొంతకాలానికి పాము కాటు ప్రభావం వల్ల ఇన్ఫెక్షన్‌కు గురై చెవులు పని చేయడం మానేశాయి. చాలా నిరాశకు గురయ్యా. ప్రైవేట్ పనులకు వెళితే వినపడడం లేదని పంపేసేవారు. ఆ సమయంలో డీఎడ్ పూర్తి చేశా. కోచింగ్ కోసం అవనిగెడ్డ వెళ్లా.. కానీ అక్కడ వారు చెప్పేది నాకు వినపడేదికాదు. దీంతో తిరిగి మాస్వగ్రామం వచ్చేశా. నా స్నేహితుడి సలహాతో ఎస్‌అండ్‌ఎస్ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌కి బ్లూటూత్ అనుసంధానం చేసి తద్వారా గోడకు స్పీకర్లు ఏర్పాటు చేసుకుని డీఎస్సీకి సిద్ధమయ్యా. పోస్టుకు ఎంపికవడం చాలా ఆనందంగా ఉంది. కూటమి ప్రభుత్వం నా భవిష్యత్‌కు బాటలు వేసింది.

- ఆడిదం సూరిబాబు, మల్లవరం, గోకవరం మండలం



30 మంది ఎంపికవ్వడం ఆనందంగా ఉంది..

గోకవరం మండలం నుంచి 30 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికవ్వడం ఆనందంగా ఉంది.. గతంలో నేను ఇక్కడ ఎంఈవోగా పనిచేసి రిటైర్డ్ అయ్యా. అందుకే డీఎస్సీ పరీక్షకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులను ప్రోత్సహించా. డీఎస్సీకి ఎంపికైన వారిని చూస్తుంటే గర్వంగా ఉంది. ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవమైనది.

- కంటే ఉదయభాస్కర్ చౌదరి, రిటైర్డ్ ఎంఈవో, గోకవరం



విద్యార్థినులు తయారుచేసిన ఆహారాన్ని రుచి చూస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

ఆహారంలో.. ఆరోగ్యం!

కిచెన్ కెమిస్ట్రీపై 'నన్నయ'లో వర్క్‌షాప్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నిరకాల పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యంతో జీవించవచ్చునని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో మహిళలకు పోషకాహారం (కిచెన్ కెమిస్ట్రీ)పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ఆరోగ్యానికి అవసరమైన పోషకాలతో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఈ విషయంలో శ్రద్ధ వహించాలని చెప్పారు. మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవడమే లక్ష్యంగా ఈసదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ చైర్మన్ ప్రొఫెసర్ వి.పీసపాటి మాట్లాడుతూ మన ఇంట్లో ఉండే వంటగది పదార్థాలతోనే రసాయన శాస్త్ర సూత్రాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకోవడం, వంటచేసేటప్పుడు కలపడం, వేడిచేయడం, చల్లబరచడం వంటి చర్యలు ద్వారా పదార్థాలు ఎలా మారతాయో తెలపడమే కిచెన్ కెమిస్ట్రీ అన్నారు. కిచెన్ కెమిస్ట్రీలోని వివిధ అంశాలను వివరించి సహజాహారం, పోషక విలువలపై అవగాహన కల్పించారు. చాక్లెట్ తయారీపై పీవీ లక్ష్మి ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. అనంతరం మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాల ప్రదర్శన పోటీలో విద్యార్థులు డ్రైఫ్రూట్స్ మిక్చర్, సున్నుండలు తదితరాలను సిద్ధం చేశారు. అతిథులు, న్యాయనిర్ణేతలు వాటిని రుచి చూసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాలుండే.. సొరకాయ అప్పాలు



వరిపిండి, సొరకాయ, నువ్వులు, పచ్చిమిరపకాయలు, ఉప్పు, నూనెను ఉపయోగించి సొరకాయ అప్పాలు చేశాం. సొరకాయని ముందుగా తురుముకుని వేయించాలి. నువ్వులను బాగా దోరగా వేయించి ఈ రెండింటినీ వరిపిండిలో వేసి ముద్దగా కలుపుకుని నూనెలో వేయించాలి. వీటిలో ఐరన్, కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్లు, కేలరీలు వంటి పోషక విలువలు ఉంటాయి. వీటిని టమోటా చట్నీతో కలుపుకుని తింటే రుచికరంగా ఉంటాయి.

- కె.దుర్గాదేవి, ఎస్‌కేడీ భవానీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ

ఆరోగ్యాన్నిచ్చే..రూట్ వెజిటబుల్ బౌల్..



బీట్‌రూట్, క్యారట్, పెరుగు, ఆవాలు, కరివేపాకు, జీలకర్ర ఉపయోగించి తయారు చేసే ఈ రూట్ వెజిటబుల్ బౌల్‌తో ఎన్నో ఆరోగ్యప్రయోజనాలున్నాయి. బీట్‌రూట్‌ని 10 నిమిషాలు ఉడకబెట్టాలి. ఆ తరువాత మరో 10 నిమిషాల పాటు చల్లార్చి తురుముకుని ఒక పాత్రలో వేసుకుని తగినంతపెరుగుతో బాటు కొంచెం ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలుపుకుని దానికి తాళింపు జతచేయాలి. ఈ బీట్‌రూట్ మిశ్రమాన్ని ఒక బౌల్‌లో వేసుకుని కొత్తిమీరతో అలంకరించుకోవాలి.

- కె.ప్రియాంక, ఎన్.జ్యోతిర్మయి, ఎంఎస్సీ విద్యార్థినులు



విద్యార్థినులు తయారుచేసిన ఆహారాన్ని రుచిచూస్తున్న న్యాయనిర్ణేతలు

ఎముకలకు బలం.. స్టఫ్డ్ బీరకాయ



ఆహారంతో ఆరోగ్యం లభిస్తోంది.. మన పూర్వీకులు వందేళ్లు బతకడమే అందుకు ఉదాహరణ. సరిగా వండుకుంటే ప్రతి కూరా ఔషధమే. బీరకాయతో తయారు చేసిన ఈ వంటకంలో వాడేపదార్థాల వల్ల కాల్షియం ఉండి ఎముకలకు బలాన్నిస్తుంది. బీరకాయ, నువ్వులు, వేరుశనగ గుళ్ళు, ధనియాలు, జీలకర్ర, నెయ్యిని ఈ వంటకం కోసం వాడా. ఈ వంటకం తినడం వల్ల శరీరానికి కార్బోహైడ్రేట్లు, విటమిన్ బి1, బి2 , బి5, బి6, ఇ, కె లభిస్తాయి. చాలా ఆరోగ్యకరమైనది.

- పి.స్నేహ. సివిల్ ఇంజనీరింగ్

శ్రీపీఠంలో మూడోసారి మహాశక్తి యాగం

- వంద కోట్ల కుంకుమార్చన
- 36వేల మందికి ఐశ్వర్య రక్ష కంకణాల పంపిణీ
- ఈ నెల 22 నుంచి అక్టోబరు 3 వరకు మహా క్రతువు
- స్వామి పరిపూర్ణానంద సరస్వతి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నరాత్రుల్లో భాగంగా కాకినాడ శ్రీపీఠం ప్రాంగణంలో 3వ మహాశక్తి యాగం-2025 మహా క్రతువును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు శ్రీపీఠం నిర్వాహకులు స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం వెనుక గల మహాశక్తి యాగం ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు వివరాలు వెల్లడించారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 3 వరకు 11 రోజులు జరిగే మహాశక్తి యాగంలో భాగంగా వంద కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన లక్ష్యంగా భక్తులు పాల్గొనేందుకు విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకోసం సుమారు 36వేల మంది భక్తులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా, 6వేల మంది నేరుగా పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. శ్రీపీఠంలో మహాశక్తి యాగాన్ని ఇప్పటికే రెండు పర్యాయాలు విజయవంతంగా నిర్వహించి, రెండు వందల కోట్ల సహస్రనామ కుంకుమార్చనలు పూర్తి చేశామన్నారు. వంద కోట్ల కుంకుమార్చనతో పాటు సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేస్తున్న సుమారు 120 మంది రుత్వికుల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

లక్ష పసుపు, నిమ్మకాయ, కొబ్బరికాయలతో అర్చన చేస్తామన్నారు. మాతృమూర్తి సంకల్పం మేరకు ఆమె దాచుకున్న సొమ్ముతో పాటు అమెరికాకు చెందిన భక్తుల సహకారంతో ఈ క్రతువులో పాల్గొన్న భక్తులకు రాగితో తయారుచేసిన ఐశ్వర్య రక్ష కంకణాల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. నిత్యం 40 నుంచి 45 వేల మందికి అన్నప్రసాదం పంపిణీకి 70 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 4 లక్షల మందికి అమ్మవారి ప్రసాదం పంపిణీ, ఇతర వాటికి సుమారు 3,400 మంది సేవలు అందిస్తారన్నారు. ఉదయం 6.30 గంటలకు హోమాలు ప్రారంభమవుతాయని, 10 గంటలకు లలితా సహస్రనామంతో కుంకుమార్చన ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలకు పూర్తి చేస్తామని స్వామి వివరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి



నార్త్ జోన్ చాంపియన్‌గా నిలిచిన అండర్-23 జట్టు సభ్యులు

నార్త్ జోన్ అండర్-23 చాంపియన్ తూర్పు గోదావరి

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు జరిగిన నార్త్‌జోన్ అండర్-23 మెన్ మల్టీ డేస్ మ్యాచెస్‌లో నాలుగు జిల్లాలు పోటీపడ్డాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. మూడు ఇన్నింగ్స్‌లో కెప్టెన్ బండారు సుజన్ 69 (నాటౌట్), 138, 30 (నాటౌట్), వైస్ కెప్టెన్ టీవీ సాయిశ్రవణ్ 148, 83, 191, కేఎస్ జయంత్ 55, 30, 167, టి.మురళీకృష్ణ 30, 41, 106 పరుగులు సాధించారు. బౌలర్లు యు.సందేశ్, వి.గిరిప్రసాద్, పి.వంశీనారాయణ, నాగేంద్రబాబు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి జట్టు విజయానికి తమ వంతు సహాయపడ్డారు.

టీం సభ్యులను, కోచ్ హకీమ్ పాషాను రంజీ మాజీ ప్లేయర్ రఫీ అహ్మద్ కిద్వాయ్, తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ శ్రీపతి, కార్యదర్శి నక్కా వెంకటేష్ అభినందించారు.

వచ్చే నెల 1 నుంచి రాజమండ్రి-తిరుపతి విమాన సర్వీసు

ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీకాంత్ వెల్లడి

కోరుకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి విమానాశ్రయం నుంచి దేశంలోని ప్రధాన నగరాలకు విమాన సర్వీసులు ఇప్పటికే నడుస్తున్నాయని... అక్టోబరు ఒకటో తేదీ నుంచి రాజమండ్రి-తిరుపతి మధ్య విమాన సర్వీసు ప్రారంభమవుతుందని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎన్‌కే శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు వారానికి మూడు రోజులు అందుబాటులో ఉంటుందన్నారు. ఏటీఆర్ 72 విమానం తిరుపతిలో ఉదయం 7.40 గంటలకు బయల్దేరి 9.25 గంటలకు రాజమండ్రి చేరుతుందన్నారు. ఇక్కడ 9.50 గంటలకు బయల్దేరి 11.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ సర్వీసు ప్రారంభానికి కావాల్సిన ఏర్పాట్ల పరిశీలన కోసం ఎయిర్‌లైన్స్ బృందం త్వరలో రాజమండ్రి విమానాశ్రయానికి రానుందని శ్రీకాంత్ వెల్లడించారు.

గ్రామ పంచాయతీలు సొంత ఆదాయంపై దృష్టి పెట్టాలి

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంత ఆదాయంపై దృష్టి పెట్టాలని ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ పంచాయతీలకు వివిధ రూపాల్లో సొంత నిధులు సమకూర్చుకోవడంపై దృష్టి సారించాలన్నారు. అటువంటప్పుడు పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించగలుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

22న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో కాకినాడలో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9గంటలకు కాకినాడ వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7799 376222 నెంబరును సంప్రదించాలన్నారు.



రాష్ట్రస్థాయి ఆర్చరీ అండర్-19 పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు 24 మంది ఎంపిక

పిఠాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 24 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక కోసం గురువారం పోటీలు నిర్వహించారు. వీటిని కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 95 మంది ఆర్చర్లు పోటీపడ్డారు. వారి ప్రతిభను పరిశీలించిన అనంతరం బాలబాలికల్లో రికర్వ్, ఇండియన్ రౌండ్, కాంపౌండ్ విభాగాల్లో 24 మందిని ఎంపిక చేశారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు మూర్తి, ఇమ్మానుయేల్, కె.చిన్నబ్బాయి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా, ఉమ్మడి జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ వెంకటరెడ్డి, మాజీ సెక్రటరీ శివరామకృష్ణ పర్యవేక్షించారు.



ఎంపిక పోటీల్లో సత్తా చూపుతున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చర్లు





దుర్గాడలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి మూలవిరాట్టుపై ప్రసరించిన సూర్యకిరణాలు, అరుణ వర్ణంలో స్వామివారు

ఉమారామలింగేశ్వరస్వామికి అరుణకిరణ స్పర్శ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆలయంలో కొలువైయున్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిపై సూర్యకిరణాలు ప్రసరించాయి. శుక్రవారం సాయంత్రం అరుణకిరణ స్పర్శతో స్వామి, అమ్మవార్లు అరుణ వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామలింగేశ్వరస్వామిని చూసి తన్మయత్వానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ప్రత్యేక పూజలు జరిపారు.

బండరాళ్లతో అలలకు అడ్డుకట్ట

కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సుబ్బంపేటలో బండరాళ్లతో చేపట్టిన తాత్కాలిక మరమ్మతులు





కొత్తపట్నం-సుబ్బంపేటవద్ద రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుడు

- ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- గోతులుగా ఉన్న రహదారికి మరమ్మతుల మాటేంటి?

కొత్తపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆర్‌అండ్‌బీశాఖఆధ్వర్యంలో కొత్తపట్నం-సుబ్బంపేట గ్రామాల మధ్య అలలకు బండరాళ్లతో అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రం ఉప్పొంగి రాకాసిఅలలు ఎగసిపడడంతో కొత్తపట్నం-సుబ్బంపేటవద్ద బీచ్‌రోడ్డును ఆనుకుని గతంలో ఏర్పాటు చేసిన రక్షణ గట్టు పైనుంచి మత్స్యకారుల ఇళ్లల్లోకి కెరటాలు దూసుకుపోవడం, బీచ్‌రోడ్డు కోతకు గురవడం తెలిసిందే. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులతో కోతకు గురైన బీచ్‌రోడ్డు, సముద్రపునీటిలో మునిగిన మత్స్యకార ఇళ్లను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎంకు సమాచారం తెలియజేయడంతో కొత్తపట్నం, సుబ్బంపేట మధ్య బండరాళ్లు డంప్ చేసి అలలకు అడ్డుకట్ట వేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో రెండురోజులుగా బండరాళ్లను డంప్ చేసి కెరటాల ధాటికి అడ్డుకట్ట వేశారు. అలల ధాటికి గోతులుగా మారిన బీచ్‌రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టకపోవడంతో బైక్‌లపై ప్రయాణించే వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరగా మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కార్తీకమాస ఏర్పాట్ల పురోగతిపై
అన్నవరం ఈవో సమీక్షా సమావేశం



కార్తీకమాస ఏర్పాట్ల రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఈవో, దేవస్థానం సిబ్బంది

అన్నవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 22నుంచి కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలకు సంబంధించి ఈనెల 5న ఈవో, చైర్మన్ సమక్షంలో ప్రవేశపెట్టిన మినిట్స్ పురోగతిపై శుక్రవారం ఈవో వీర్ల సుబ్బారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా పర్వదినాల్లో భక్తులు లక్షమందికిపైగా విచ్చేస్తారని అంచనా వేస్తుండగా వారికి ఎక్కడా అసౌకర్యంకలగకుండా ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటలనుంచి సర్వదర్శనాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్తీకమాసంలో ప్రధాన ఉత్సవాలైన గిరిప్రదక్షిణ, స్వామివారి తెప్పోత్సవం తదితర వాటిపై చర్చించి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. దేవస్థానం సిబ్బందితోపాటు సేవాసంస్థల సభ్యుల సేవలను వినియోగించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. త్వరలో రెవెన్యూ, పోలీస్, ఇతరశాఖల అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ తేదీ నిర్ణయిస్తామని అప్పటికి విభాగ అధిపతులు తమకు నిర్దేశించినలక్ష్యాల్లో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏఈవోలు, సూపరెంటెండెంట్‌లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు సమక్షంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ టీడీపీలో చేరిక



ఎమ్మెల్సీ పద్మశ్రీకి కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం చంద్రబాబు

కాకినాడసిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సమక్షంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ శుక్రవారం టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబును ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు పద్మశ్రీ విడుదల చేసిన ఒక ప్రకటనలో వైసీపీకి రాజీనామా చేసి ఏడాది అయ్యిందన్నారు. పదవిలో ఉన్నా ప్రజలకు పెద్దగా ఏమీ చేయలేకపోయామన్నారు. వైసీపీలో తనకు కనీసం మీడియాతో మాట్లాడే అవకాశం లేకుండా పోయిందన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ పేరాబత్తుల

- తొలిసారిగా శాసనమండలిలో అడుగుపెట్టిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపిన రాజశేఖరం



చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు చెబుతున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల

కాకినాడసిటీ,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా శాసన మండలిలో అడుగుపెట్టిన పేరాబత్తుల రాజశేఖరం శుక్రవారం సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 30ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

అన్నవరంలో వివిధ లైసెన్స్ హక్కులకు బహిరంగ వేలం

అన్నవరం,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వ్యాపార లైసెన్స్ హక్కులకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం హోరాహోరీగా జరిగింది. పాత బుకింగ్ కౌంటర్ ఎదురుగా షాపింగ్‌కాంప్లెక్స్ ఒకటో నెంబరుకు గతంలోఏడాదికి రూ.81.84లక్షలుకాగా ఈఏడాది రూ.1.20కోట్లకు హెచ్చుపాట దక్కించుకున్నారు. షాపునెంబరు రెండుకు గతంలో రూ.43.56లక్షలుండగా తాజావేలంలో రూ.85.44లక్షలు, షాపు నెంబరు నాలుగుకు గతంలో రూ.43.56 లక్షలు ఆదాయం రాగా ఈఏడాది రెట్టింపు మొత్తంతో రూ.85.44లక్షలు సమకూరింది. 6వనెంబరు షాపునకు గతంలో రూ.25.80 లక్షలుండగా తాజా వేలంలో రూ.42.48లక్షలకు హెచ్చుపాటలు వచ్చాయి. జ్యూస్‌పాయింట్ నిర్వహణకు స్వల్పంగానే ఆదాయం పెరిగింది. గతంలో రూ.25.08 లక్షలు ఈఏడాది రూ.25.32లక్షలకు దక్కించుకున్నారు.

తగ్గిన టోల్‌గేట్ వసూలు లైసెన్స్ హక్కు వేలం

రత్నగిరికి వచ్చే నాలుగు, ఆరుచక్రాల వాహనాలనుంచి టోల్‌వసూలు లైసెన్స్ హక్కుకు గతంలో రూ.2.27కోట్లు ఆదాయం లభించగా రెండుసార్లు టెండర్లు పిలిచినా అంతమొత్తం చెల్లించేందుకు ఎవరూరాలేదు. దీంతో మూడోసారి నిర్వహించిన వేలంలో అత్యధికంగా రూ.1.98 కోట్లకు టెండరుదారులు మొగ్గుచూపారు. కాలపరిమితి ముగియనుండడం, రాబోయే కార్తీకమాసం దృష్టిలో ఉంచుకుని ఈ వేలాన్ని ఖరారు చేయాలని అధికారులు నిర్ణయించారు.

కోనసీమ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యురాలిగా రజనీ



పుణ్యమంతుల రజనీ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యురాలిగా భట్నవిల్లి గ్రామానికి చెందిన పుణ్యమంతుల రజనీని నియమించారు. మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా ఉన్న రజనీని జిల్లా కమిటీ సభ్యురాలిగా నియమిస్తూ కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంతో నమ్మకంతో పదవిని అప్పగించిన కలెక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌వాదులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు
శివకోడు హైస్కూలు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శివకోడు హైస్కూలు విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాస్

రాజోలు, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలుగేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా మోరి జడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థులు అండర్-17 విభాగం నుంచి పైడిమర్రి ఇంద్రజ, అండర్-14 విభాగంలో బాలం ప్రణతి, వీరమల్లు చిరుతేజ ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉంద్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ అభినందించారు.

ఉమ్మడి జిల్లా అండర్-19 కాలేజీ గేమ్స్
జూడో పోటీలకు 16మంది ఎంపిక



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

జగ్గంపేట,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):జగ్గంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాలేజీ గేమ్స్ జూడో పోటీలకు కళాశాల ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావుఅధ్యక్షతన ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాలేజీ గేమ్స్ సెక్రటరీ వెంకటరెడ్డి పాల్గొన్నారు. దీనికి రిఫరీగా జూడో మాస్టర్ తాండ్రోతు వీరవెంకటరమణ వ్యవహరించారు. ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా జూడో పోటీలకు ఎంపికైన 8మంది బాలురు,8మంది బాలికలు రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని రిఫరీ వెంకటరమణ తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలేజీ గేమ్స్ జూడో పోటీలకు ఎంపిక కార్యక్రమం జగ్గంపేట జూనియర్ కాలేజీలో నిర్వహించామని,ఎంపికైన వారంతా రాష్ట్రస్థాయిలో జూడోపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రిఫరీ సాయి కృష్ణ, దేవి కృష్ణ, లెక్చరర్స్ షేక్ మదీనా, సీహెచ్ రాము పాల్గొన్నారు.

ఇదిగో భోజనానికి
వచ్చేస్తున్నా..
అన్న పావుగంటకే కబళించిన మృత్యువు

- టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ఢీకొన్న స్పోర్ట్స్ బైక్
- వ్యక్తి మృతి
- తొండంగిలో ఘటన

తొండంగి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కుమారుడు నిర్వహిస్తున్న షాపు తెరిచేందుకు వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం భోజనానికి వస్తున్నానని కుమారుడికి ఫోన్ చేసి చెప్పిన పావుగంటకే మృత్యువాతపడిన సంఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు సుబ్బరాయపురం వద్ద శుక్రవారం టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్‌సైకిల్‌ను స్పోర్ట్స్ బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. తొండంగి మండలం రావికంపాడు గ్రామానికి చెందిన చిత్రాడ రాజు(50) బెండపూడి శివారు సుబ్బరాయపురంలో తన కుమారుడు తాతాజీ నడుపుతున్న పాతసామాను షాపు తెరిచేందుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ఉదయం 6గంటలకు వెళ్లాడు. మధ్యాహ్నం 12గంటలకు షాపు కట్టేసి ఇంటికి భోజనానికి వస్తున్నానని కుమారుడికి ఫోన్‌చేసి చెప్పాడు. మరో పావుగంటలో ఇంటికి వస్తాడనుకుంటుండగా.. టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్‌సైకిల్‌పై రావికంపాడు వెళ్తున్న రాజును బెండపూడినుంచి అన్నవరం వైపు వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయా స్పోర్ట్స్ బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో రాజు కాలువిరిగి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసి కుమారుడు కాసేపు అచేతనుడయ్యాడు. స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు తాతాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యానాం బాడీ బిల్డింగ్ సభ్యులతో స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ పెండెం

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు పయనం

యానాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భీమవరంలో ఈనెల 21వతేదీ నుంచి జరగనున్న 21వ రాష్ట్రస్థాయి ఓపెన్ లెవెల్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు యానాం బాడీ బిల్డింగ్ సభ్యులు వెళ్లనున్నారు. న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఖాసీ ఆధ్వర్యంలో మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తామని యానాం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాళ్ల జీవన్ ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా యానాం మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, పీడీ గుత్తుల మల్లేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ యానాంలో ఉన్న జిమ్‌లను ఉపయోగించుకుని బాడీ బిల్డర్లుగా మంచి ప్రతిభ కనబరచాలని కోరారు.

బారులు తీరిన ఆటోలు

- వాకలపూడి ఏడీబీ రోడ్డులో వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లో ఆటోల కండిషన్ బ్రేక్ చేయించుకునేందుకు క్యూ
- వాహన మిత్ర పథకం దరఖాస్తుకు చివరి తేదీ కావడంతో హడావుడి



ఏడీబీ రోడ్డులో వెహికల్ టెస్టింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ఆటోలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడి ఏడీబీరోడ్డులో ఆటోలు బారులు తీరాయి. ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లో ఆటోలకండిషన్ బ్రేక్ చేయించుకునేందుకు రెండు రోజులుగా జిల్లా నలుమూలల నుంచి ఆటోడ్రైవర్లు తమ ఆటోలను ఇక్కడకు తీసుకువచ్చారు. వాహన మిత్ర పథకానికి సంబంధించి బుధవారంనుంచి సచివాలయాల్లో ఆటోడ్రైవర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సొంతంగా ఆటో, మోటారు, మేక్సీ క్యాబ్ నడుపుతూ జీవనోపాధి పొందుతున్న వారికి ఈ పథకం వర్తిస్తోంది. దరఖాస్తులకు ఆఖరుతేదీ ఈనెల 19వతేదీ శుక్రవారం కావడం, ఈనెల 24న తుది జాబితా విడుదల చేయడం, అక్టోబరు 1న అర్హత సాధించిన ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాలో రూ.15వేలు జమచేయనున్న నేపథ్యంలో ఆటోడ్రైవర్లు తమ ఆటోలు, వాహనాలకు బ్రేక్, ఫిట్‌నెస్ చేయించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వాకలపూడి ఏటీసీ సెంటర్‌కు అధికసంఖ్యలో తరలివచ్చారు.

సర్వర్ పనిచేయక జాప్యం

రెండురోజులుగా ఆటోమేటిక్ వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్(ఏటీసీ) వద్ద ఆటోలతో కిక్కిరిసిపోయింది. దీంతో పరిసర ప్రాంతాలతోపాటు ఏడీబీ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చేయించుకునే సమయంలో క్యూ పద్ధతి లేకపోవడం, ఆటోలన్నీ ఒకేసారి రావడంతో ఏటీసీ సెంటర్ సెక్యూరిటీ, ఆటోడ్రైవర్ల మధ్య వాగ్వాదం జరిగింది. సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో ఫిట్‌నెస్ స్టేషన్‌లో జాప్యం జరిగిందని, దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచాలని ఆటోడ్రైవర్లు కోరుతున్నారు. ట్రాఫిక్ స్తంభించడంతో తిమ్మాపురం ఎస్‌ఐ గణేష్‌కుమార్ సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.



స్మార్త రత్న అవార్డు అందుకుంటున్న వలబోజుల రాకేష్

యువకుడికి స్మార్త రత్న అవార్డు

చింతూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చింతూరుకు చెందిన యువకుడు వలబోజుల రాకేష్‌శర్మ స్మార్తరత్న అవార్డు అందుకున్నారు. తమిళనాడు కేంద్రంగా ఉన్న అంతర్జాతీయ హిందూ దేవాలయాలు ఆధ్యాత్మిక జ్యోతిషుల సంక్షేమ ట్రస్ట్ వారు అంతర్జాతీయ ఆరో ఆధ్యాత్మిక జ్యోతిష సదస్సును తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు వేదపండితులు పాల్గొన్నారు. మన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన యువకుడు వలబోజుల రాకేష్‌శర్మకు స్మార్తరత్న అవార్డు దక్కింది. అవార్డు ఎంపిక తెలంగాణ కేంద్రంగా నిర్వహించిన నేపథ్యంలో రాకేష్‌కు అంతర్జాతీయ హిందూ దేవాలయాలు, ఆధ్యాత్మిక జ్యోతిషుల సంక్షేమ ట్రస్ట్ తెలంగాణ ఐకానిక్-2025 పేరిట అవార్డును వేదపండితుల సమక్షంలో నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో అత్తలూరి బాలశంకరశాస్త్రి, జోనోజు పరిపూర్ణాచార్యులు, డాక్టర్ విశ్వనాథాచారి పాల్గొన్నారు.

న్యూఢిల్లీ సైనిక్ క్యాంపులో అమలాపురం యువకుడు



జావేద్ హుస్సేన్‌ను అభినందిస్తున్న సుబ్బరాజు తదితరులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఎన్‌సీసీ క్యాడెట్ న్యూఢిల్లీలోని సైనిక్ క్యాంపులో పాల్గొనడం ఒక కల అని అమలాపురం ఎస్కేబీఆర్ ప్రిన్సిపాల్ వడలి సుబ్బారావు అన్నారు. అటువంటి క్యాంపులో తమ కళాశాల విద్యార్థి జావేద్ హుస్సేన్ పాల్గొనడం అభినందనీయమన్నారు. కాకినాడ ఎన్‌సీసీ గ్రూపు నుంచి అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల ఆర్మీ క్యాడెట్ జావేద్ హుస్సేన్ పాల్గొని సైనిక్ క్యాంపు నుంచి శుక్రవారం కళాశాలకు రాగా ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఏటా ఇండియన్ ఆర్మీలోను, నేవీలోను ఉద్యోగాలు సాధిస్తుంటారన్నారు. ఇటీవల ఎన్‌సీసీ-సి సర్టిఫికెట్ సాధించిన ఇద్దరు క్యాడెట్లు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికైనట్టు తెలిపారు. జావేద్ హుస్సేన్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, డీఎస్ఎన్ రాజు, పరిపాలనాధికారి ఎ.వెంకటపతిరాజు అభినందించారు.

అంతర్వేది ఆలయానికి చాగంటికి ఆహ్వానం



చాగంటికి స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఏసీ వరప్రసాద్

అంతర్వేది, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రవచనకార్యక్రమం నిర్వహించాలని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ శుక్రవారం చాగంటి కోటేశ్వరరావును స్వయంగా కలిసి ఆహ్వానించారు. వచ్చేఏడాది జనవరిలో సంక్రాంతి అనంతరం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం ఉంటుందని ఏసీ ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యుల వింజమూరి రంగాచార్యులుతో కలిసి చాగంటిని ప్రత్యేకంగా జేసీ ప్రసాద్ ఆహ్వానించారు.

22 నుంచి దసరా వేడుకలు

అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22వతేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి అక్టోబరు 2 వరకు దశమి వరకు రాజ్యలక్ష్మితాయారమ్మవారు, అశ్వరూఢాంబిక ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. పదిరోజులపాటు పూజలు జరుగుతాయని, 2వ తేదీ రాత్రి 7.30 గంటలకు స్వామికి గజవాహనంపైగ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. గుర్రాలక్కమ్మ ఆలయంలో సామూహిక ఉచిత కుంకుమ పూజలను నిర్వహిస్తామన్నారు.

ఆకొండి సేవలకు గుర్తింపుగా ఉత్తమ పురస్కారం

కాట్రేనికోన, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్రకళారంగంలో పదేళ్లుగా కాట్రేనికోనకు చెందిన అంజి ఆకొండి సేవలకు గుర్తింపుగా మేఘాలయ రాష్ట్రంలో ప్రజాడైరీ మాసపత్రిక వార్షికోత్సవంలో ఉత్తమ పురస్కారం లభించింది. మేఘాలయ రాజ్‌భవన్‌లో గవర్నర్ విజయశంకర్ ఈ పురస్కారాన్ని అందించారు. పురస్కారాలు అందుకున్న వారిలో నటుడు రాజేంద్రప్రసాద్, చిత్రకళారంగంనుంచి కళాసాగర్ ఎల్లపు ఉన్నారు. ప్రజాడైరీ వ్యవస్థాపకుడు సురేష్ పాల్గొన్నారు.



మేఘాలయ గవర్నర్ విజయ శంకర్ నుంచి పురస్కారం అందుకుంటున్న అంజి ఆకొండి

డ్రగ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి

ఈగల్ ఇన్‌స్పెక్టర్ సూర్యమోహన్‌రావు

రాజానగరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన సమష్టి కృషితోనే సాధ్యపడుతుందని ఈగల్ ఇన్‌స్పెక్టర్ పీవీ సూర్యమోహన్‌రావు అన్నారు. జీజీయూ, గైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాగింగ్, మాదకద్రవ్య దుర్వినియోగ వ్యతిరేక అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది.దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సూర్యమోహన్‌రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణా, వినియోగానికి యువత దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను గుర్తించి, యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా, దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాలను తాకరాదని విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో జీజీయూ ప్రొవైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఈగల్ ఎస్.ఐ బి.నరేష్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు బి.శ్రీనివాస్, ఎన్.ఈశ్వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌తోనే వృత్తిపరమైన విజయాలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్య, వ్యక్తిగత తదితర వృత్తిపరమైన విజయాల్లో కీలకపాత్ర పోషించేది ప్రభావవంతమైన సాఫ్ట్‌స్కిల్స్ మాత్రమేనని డేటా ప్రో జనరల్ మేనేజర్ కె.కిషోర్ వర్మ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంప్లాయిబిలిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 45 రోజులపాటు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సాఫ్ట్‌స్కిల్స్ నైపుణ్యాలను విద్యా, సామాజిక, ఇతర అంశాల్లో ఎలా ఎదుర్కొనవచ్చో ఈ శిక్షణ ద్వారా తెలిసిందన్నారు. కోర్సు కో ఆర్డినేటర్ పీవీబీ సంజీవరావు మాట్లాడారు. డేటా ప్రో బ్రాంచి మేనేజర్ బి.సునీల్‌కుమార్ రెడ్డి, ట్రైనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసిం హం పంతులు ఆదర్శప్రాయుడని డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్‌ఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక వంకాయలవారి వీధిలోని సిటీ మునిసిపల్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన చిలకమర్తి జయంతి కార్యక్రమానికి ఆయన విచ్చేసి చిలకమర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు... ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిలకమర్తి స్వరాజ్య సమరంలో పాల్గొన్నారని, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో సమరయోధుడు బిపిన్ చంద్రపాల్ రాజమండ్రిలో పాల్గొన్న సభలో భరత ఖండంబు చక్కని పాడియావు పద్యాన్ని చిలకమర్తి ఆశువుగా చెబితే, అది జాతీయోద్యమానికి ప్రేరణగా నిలిచిందన్నారు.ఈయన అనేక నవలలు, నాటకాలు, ప్రహసనాలు, మహనీయుల చరిత్రలు రాసారన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లోని విజేతలకు చిలకమర్తి ఫౌండేషన్ కార్యదర్శి పెరుమాళ్ళ రఘునాథ్ పుస్తకాలను, సర్టిఫికెట్లను అందజేశారు. హెచ్‌ఎం పి.దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అకడమిక్ ఫోరమ్ సభ్యులు పాఠశాలల సందర్శన

బిక్కవోలు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అకడమిక్ ఫోరమ్ సభ్యులు మండలంలోని పలు పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొంకుదురు, కొంకుదురు సావరం,పందలపాక ప్రాథమిక పాఠశాలల్లో ఫోరమ్ కన్వీనర్(ఎంఈవో) సీహెచ్‌వీవీ సత్యనారాయణ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, టీచర్ల హ్యాండ్ బుక్స్, మార్కుల రిజిస్టర్లు తనిఖీ చేశారు.మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని, పాఠశాలకు హాజరైన విద్యార్థులందరూ భోజనం తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఫోరమ్ సభ్యులు సీతారామ్, నాగేంద్ర, సుబ్బారెడ్డి, సీఆర్‌పీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గుమ్మళ్లదొడ్డిలో ఉచిత వైద్య శిబిరం


శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తున్న దృశ్యం

గోకవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఆదిత్య మల్టీ స్పెషాలిటీ, శ్రీవాణి డెంటల్ ఆసుపత్రుల వైద్యులు శిబిరానికి హాజరై కార్మికులతో పాటు, స్థానికులకు దంత, నేత్ర పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వివేక్‌కుమార్‌శుక్లా మాట్లాడుతూ పరిశ్రమ ఉద్యోగులతో పాటు సమాజ ఆరోగ్య పరిరక్షణ కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఏఎస్‌వో భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రసాయన రహిత ఉత్పత్తులు పండించేలా రైతాంగంతో మేలైన వ్యవసాయ పద్ధతులు అవలంభింపజేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులకు మేలైన వ్యవసాయ పద్ధతులపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం స్థానిక ఏడీఏ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు కమిషనరేట్ ఏడీఏ వెంకటేశ్వర్లు సాంకేతిక విశిష్టత సుస్థిర విధివిధానాలతో వచ్చిన మార్పులపై వివరించారు. రైతులు రైతు ఉత్పత్తి సంఘాలుగా నమోదు చేసుకోవాలని కోరారు. 14 వారాల పాటు జరిగే పొలం బడిపై పూర్తి అవగాహన వుండాలన్నారు. కమిషనరేట్ వ్యవసాయాధికారి యుగంధర్ విధివిధానాలను తెలియజేశారు.

మహిళా కారాగారం పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు మహిళా కారాగారాన్ని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి పరిశీలించారు. శుక్రవారం జిల్లా పర్యటకు వచ్చిన ఆమె ఎన్‌హెచ్‌ఆర్‌సీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఇంద్రజిత్‌తో కలిసి ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీల బ్యారక్స్ హాస్పిటల్, జనరల్ కిచెన్, బేకరి, పిల్లల క్లబ్, ఆర్‌వో ప్లాంట్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలతో ముఖాముఖీగా మాట్లాడి వారి కేసుల వివరాలు, జైలులో అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. బేకరిలో సుధార్ ప్రొడెక్ట్‌ను చూసి వాటిని తయారు చేస్తున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంతకుమారి, ఇందిరా భారతిరాయ్, పి.పావని, కె.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజానగరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని నాసేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. మండలంలో పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి విడుదలైన సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కులను బాధిత కుటుంబాలకు శుక్రవారం ఆమె అందజేశారు. పాత వెలుగుబంద, నందరాడ, కలవచర్ల, తూర్పుగోనగూడెం, తోకాడ, ఫరిజలిపేట, ముక్కినాడ, కొత్తతుంగపాడు, పాతతుంగపాడు, చక్రద్వారబంధం, రాధేయపాలెం గ్రామాల్లో బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు గోవిందరెడ్డి
గుండెపోటుతో మృతి



అనపర్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనపర్తి టీడీపీ సీనియర్ నాయకుడు, సొసైటీ డైరెక్టర్ నల్లమిల్లి గోవిందరెడ్డి(58) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి గోవిందరెడ్డి ఎనలేని సేవలందించారు. 2024 ఎన్నికలలో కూటమి విజయానికి కృషి చేశారు. గోవిందరెడ్డికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి సంతాపం తెలిపారు.

ఏపీఎన్‌జీజీవో సభ్యత్వ నమోదు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీజీవో అసోసియేషన్ నగర యూనిట్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. శుక్రవారం ఫారెస్ట్ డిపార్ట్మెంట్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ ఉద్యోగుల దగ్గరకు వెళ్లి సంఘం సభ్యత్వ నమోదు చేయించే కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యాలయాకు వెళ్లి సభ్యత్వ నమోదు చేశారు.

బోయి భీమన్న జయంతి

కడియం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం తన సాహిత్యంతో అహర్నిశలు కృషి చేసిన ప్రజాకవి బోయి భీమన్న అని జనవిజ్ఞాన వేదిక పర్యావరణ రాష్ట్ర కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. బోయి భీమన్న జయంతి శుక్రవారం జనవిజ్ఞానవేదిక, అరసం, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కళాసేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. భీమన్న చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో తోరాటి వసంతరావు, గండి స్వామిప్రసాద్, తమ్మిశెట్టి ప్రసాద్, ఆకుల సూర్యనారాయణ, చిక్కాల ఈశ్వరరావు పాల్గొన్నారు.

దుకాణం దగ్ధం

గోకవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంటికొండ గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో దుకాణం దగ్ధమైంది. గ్రామానికి చెందిన నెల్లి శ్రీనివాసరావుకు చెందిన దుకాణం జరిగిన ప్రమాదంలో ఫ్రిడ్జ్, ఇతర సామగ్రి కాలిపోయాయి. వ్యక్తిగత కక్ష్యలతో దుండగులు దుకాణానికి నిప్పంటించి ఉండవచ్చని శ్రీనివాసరావు ఆరోపిస్తున్నాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందినట్టు సమాచారం.

కానరాని ఫాగింగ్

- గోకవరంలో అటకెక్కిన యంత్రాలు
- పెరిగిన దోమల బెడద
- రాత్రుళ్లు కునుకు పట్టడం లేదంటూ గ్రామస్థుల ఆవేదన


ఓ పంచాయితీలో నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ యంత్రం

గోకవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలా గ్రామాల్లో చెత్త, చెదారాలు పేరుకుపోయి దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కొన్ని రోజులుగా ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడుతున్నారు. మురుగనీటి నిల్వల్లో దోమలు విజృంభిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం నుంచి చర్యలు కనిపించడంలేదు. గత ప్రభుత్వ హయంలో ఇచ్చిన ఫాగింగ్ యంత్రాలు వినియోగించకపోవడంతో మరమ్మతులకు గురై పంచాయతీ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. ఆర్థికపరమైన కారణాల వల్లే వీటిని వినియోగించడంలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.యంత్రాలు పని చేసేందుకు పెట్రోలు, రసాయనం నుంచి పొగరావడానికి డీజిల్ ఉపయోగించాలి.ఇందుకు అయ్యే ఖర్చు కూడా వేలాల్లోనే ఉంటుంది. దీంతో మూడొంతుల పంచాయతీల్లో ఎవరూ ఫాగింగ్ యంత్రం జోలికి వెళ్లడం లేదు. అంతే కాకుండా యంత్రాల వినియోగంపై కూడా సిబ్బందికి తగిన శిక్షణ లేదు. మరమ్మ తులకు గురైతే వాటిని బాగు చేసే వాళ్లు కూడా అరుదుగా ఉన్నారు. వర్షాకాలం ప్రారం భం నుంచి ఇప్పటివరకు ఫాగింగ్ యంత్రాలతో దోమల నియంత్రణకు చర్యలు చేపట్టలేదు. మండలంలో 14 గ్రామ పంచాయతీలున్నాయి. తంటికొండ, కొత్తపల్లి, కామరాజుపేట, మల్లవరం, గోకవరం గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. అయితే వాటిలో కొన్ని గ్రామాల్లో యంత్రాలను ఇంతవరకు వినియోగించిన దాఖలాలు లేవని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని పలువురు కోరుతున్నారు. దోమల కారణంగా రాత్రిళ్లు కునుకు కరువైందని వాపోతున్నారు. ఇప్పటికే పలువురు జ్వరాల బారినపడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు చేపడతాం. రన్నింగ్‌లో ఉన్న ఫాగింగ్ యంత్రాలతో పాటు మరమ్మతుకు గురైన యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి ఫాగింగ్ చర్యలు చేపడతాం.

-గోవిందు, ఎంపీడీవో

సాంకేతిక లోపాలను సవరించండి

- బిక్కవోలు, అనపర్తి, కడియంలో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్
- సబ్ రిజిస్ట్రార్లకు వినతులు


అనపర్తిలో వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

బిక్కవోలు/అనపర్తి/కడియం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు తమ ఆస్తులు అమ్మాలనుకున్నప్పుడు, కొనాలనుకున్నప్పుడు చేసుకునే రిజిస్ట్రేషన్ల విషయంలో తలెత్తే సాంకేతిక లోపాలను సవరించాలంటూ మండలంలోని దస్తావేజు లేఖర్లు శుక్రవారం బిక్కవోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర దస్తావేజుల లేఖర్ల సంఘం పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో లేఖర్ల సంఘం మండలాధ్యక్షుడు మజ్జి గణపతిరావు మాట్లాడుతూ కక్షిదారులు తరపున రిజిస్ట్రేషన్ నిమిత్తం డేటా ఎంట్రీ చెక్ స్లిప్ చేసే సమయంలో ఓటీపీ వల్ల వచ్చే ఇబ్బందులు తొలగించాలని, పీడీఈ చేసి సబ్మిట్ చేసిన తర్వాత చిన్న చిన్న తప్పులు వస్తే వాటిని సవరించడానికి సబ్ రిజిస్ట్రార్‌కు ఇచ్చిన అమెండ్‌మెంట్ ఆప్షన్ తిరిగి పునరుద్ధరించాలని, కార్డ్ ప్రైమ్ 2.0లో సాంకేతిక లోపాలను సరిచేయాలని డిమాండ్ చేశారు.సబ్ రిజిస్ట్రార్‌కు అమెండ్‌మెంట్ ఆప్షన్ తీసేయడం వల్ల ఎన్నిసార్లు తప్పులు వస్తే అన్ని సార్లు కక్షిదారులు మరలా చలానాలు కట్టుకుని ఆ తప్పులు సరిచేసుకోవాలని, దీని వల్ల కాలం, డబ్బు వృథా అవుతున్నాయన్నారు. ఈ విషయాలపై ఎన్నిమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలి తం లేకపోవడంతో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్ర, శనివారాలు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు గణపతిరావు వివరించారు. అనంతరం ఆయన సభ్యులతో కలసి వినతి పత్రాన్ని సబ్ రిజిస్ట్రార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చినబాబు, బాలాజీకుమార్, సీతారామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. కాగా దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్ కార్యక్రమం వల్ల శుక్రవారం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదని సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ శ్రీనివాసబాబు తెలిపారు. కాగా అనపర్తిలో వినతిపత్రాన్ని లేఖర్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌కు అందజేశారు. కడియం కార్యక్రమంలో గుత్తుల కృష్ణమూర్తి, వనుం శ్రీను, దంగుడుయ్యం సూర్యనారాయణమూర్తి, యాగన రాజేశ్వరరావు, కవికొండల శ్రీను, సాయి, పోసి, చక్రి, మౌనిక, తత్తరమూడి శ్రీను, ఎస్ పోశిబాబు పాల్గొన్నారు.


బిక్కవోలు నిరసన తెలుపుతున్న లేఖర్లు

మహిళల ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం

- అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామగురెడ్డి
- పలుచోట్ల స్వస్థ నారి సశక్త్ పరివార్

అనపర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి అన్నారు. స్వస్థ నారి సశక్త్ పరివార్‌లో భాగంగా శుక్రవారం ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యాధికి చికిత్స ఉందని, ముందుగానే దానిని గుర్తించి చికిత్స తీసుకుంటే నయమవుతుందన్నారు. డాక్టర్ పద్మశ్రీ మాట్లాడుతూ క్యా న్సర్‌ను స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించవచ్చని అశ్రద్ధ చేయకుండా పరీక్షలు చేయించుకునిచికిత్స తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా సుమారు 600మంది మహిళలకు వివిధ పరీక్షలు నిర్వహించారు. క్షయ బాధితులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి డీసీ సభ్యు లు డీకే దుర్గాప్రసాద్, మల్లేశ్వరి, అన్నవరం, రాంబాబు, వైద్యులు తరుణ్, శ్రీదర్, శారద, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


భాస్కరనగర్‌లో స్వస్థ నారి సశక్త్ పరివార్ కార్యక్రమం

కడియం: స్థానిక భాస్కరనగర్‌లో వైద్యాధికారి డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న ఆధ్వర్యంలో జరిగిన స్వస్థ నారి సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని పర్యవేక్షించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొర్బు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం,వైద్య సిబ్బంది విల్సన్‌పాల్, రాము, కుందన, శారద, నిర్మల, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల గ్రామంలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 122 మంది మహిళలకు వైద్య సేవ లందించారు. ఈ సందర్భంగా డాక్టర్ యేసురాణి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం స్త్రీ ఆరోగ్యానికి కట్టుబడి ఉంటామని నాయకులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం మధురలక్ష్మి, పీఏసీఎస్ గెడ్డం కృష్ణ, గెడ్డం తిమ్మారావు, మట్టాడి వెంకటరమణ, పెరుగు శ్రీనివాస్, సత్యం రామకృష్ణ పాల్గొన్నారు.


సీతానగరంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ సబ్బారపు పద్మావతి ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 102 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి ఆధ్వర్యంలో ఊలపల్లిలో నిర్వహించిన శిబిరంలో 84 మంది మహిళలకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు రమ్య, ఎంపీటీసీలు మంగయ్యమ్మ, శివ, కూటమి నేతలు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, పడాల చిన బుజ్జి, గుణ్ణం శ్రీనివాసచౌదరి,సిబ్బంది పాల్గొన్నారు.

కోరుకొండ: బూరుగుపూడిలో దోసకాయలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తరణి (పలమనాలజిస్ట్) ఆధ్వర్యంలో సుమారు 300 మంది మహిళలకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కంటే నాగ కేశవరావు, కట్ట వీరసూరి, యేసు, లోవరాజు, సీహెచ్‌వో జోత్స్న ప్రియదర్శిని, భాగ్యలక్ష్మి రేఖ, వై.రమ, ఏఎన్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

రత్నంకు ఇంటర్ నేషనల్
పీస్ అండ్ టాలెంట్ అవార్డు

అనపర్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పవరం గ్రామానికి చెందిన పాస్టర్ కోరుమిల్లి రత్నం ఇంటర్ నేషనల్ పీస్ అండ్ టాలెంట్ అవార్డును ఇటీవల అందుకున్నారు. హైదరాబాద్‌లోని గోల్డెన్ ఫ్యూచర్ గ్లోబల్ సేవా ఫౌండేషన్ ప్రతి ఏటా అందించే అవార్డుల్లో భాగంగా సమాజ సేవ చేస్తున్న రత్నంను ఎంపిక చేసి హైదరాబాద్‌లో పురస్కారం అందజేశారు. పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అవార్డును అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

హైస్కూలుకు కంప్యూటర్,
ప్రింటర్ అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి ఘాట్‌లోని రాజమండ్రి వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో లాలాచెరువు జడ్పీ హైస్కూలు రూ.52 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్లను శుక్రవారం అందజేశారు. హెచ్‌ఎం ఎస్‌ఎల్‌వీ రమేష్‌కు ట్రస్టు గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు యియ్యపు మురళీధర్ వాటిని అందజేశారు. కార్యక్రమంలో మద్దుల మురళీకృష్ణ, యలమర్తి వెంకటేశ్వరరావు, మండవిల్లి వెంకటరాజు, సత్యవరపు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో
అంతరాయం

ట్రాన్స్‌కో ఈఈ నటరాజన్

అనపర్తి/సీతానగరం/బిక్కవోలు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మలు తొలగించడం నిమిత్తం శనివారం పలు చోట్ల విద్యుత్ సరపరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ జేవీబీ నటరాజన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా దుప్పలపూడి, అనపర్తి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, సీతానగరం మండలంలోని మిర్తిపాడు సబ్ స్టేషన్ పరిధిలోని మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ములకల్లంక బొబ్బిల్లంక గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గం. వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు చెప్పారు. అలాగే బిక్కవోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నటరాజన్ తెలిపారు. బిక్కవోలు సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల సందర్భంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. బిక్కవోలు, ఊలపల్లి గ్రామాలతోపాటు ఇండస్ట్రియల్, వ్యవసాయ వినియోగదారులకు అంతరాయం ఏర్పడుతుందని, సహకరించాలని కోరారు.

లేపాక్షిలో దసరా
డిస్కౌంట్ అమ్మకాలు

రాజమహేంద్రవరం కల్చరల్ సెప్టెంబర్19 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద లేపాక్షి ఎంపోరియంలో ఈ నెల 20 నుంచి అక్టోబరు 1 వరకు ఎంపిక చేయబడిన హస్తకళలు, చేనేత వస్త్రాలపై 10నుంచి 15శాతం డిస్కౌంట్ లభిస్తుందని, ఆంధ్రప్రదేశ్ హస్త కళల మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఓ ప్రకటన మేరకు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ జిమోనిక తెలియజేశారు. వినియోగదారులు, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలంటూ
వీఆర్‌ఏల ఆందోళన

బిక్కవోలు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ)లు శుక్రవారం బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పేస్కేలు అమలు, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హు లైన అందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని, కారుణ్య నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో వినతి పత్రాన్ని తహశీల్దార్ సత్యకృష్ణకు అందజేశారు.

రాష్ట్ర జూడో పోటీలకు రాహుల్ ఎంపిక

అనపర్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల ఎంపికలో అనపర్తి శివారు కొత్తూరులోని జూనియర్ కళాశాల విద్యార్థి కె.రాహుల్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎం.రాజు తెలిపారు. అండర్-19లో 65 కిలోల విభాగంలో రాహుల్ ఎంపికయ్యాడని, త్వరలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు.

గణన పద్ధతులపై
25 నుంచి ఆన్లైన్ సదస్సు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25,26 తేదీల్లో అంతర్జాతీయ సెమినార్‌ను ఆన్లైన్‌లో నిర్వహిస్తామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ గణితంలో గణన పద్ధతులు అనే అంశంపై ఈ సెమినార్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, విభాగాధిపతి టి.హైమావతి, విభాగఅధ్యాపకులు రేవతి, వరకుమార్, శ్రీనివాసరావు, మల్లిప్రియ, అశోక్, గీత, సుజాత పాల్గొన్నారు.


పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్
ప్రకటించాలి: పీఆర్టీయూ

రాజానగరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్‌ను ప్రకటించాలని పీఆర్టీయూ సంఘ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదుపై ప్రచార కార్యక్రమంలో భాగంగా రాజానగరం మండలంలో శుక్రవారం పర్యటించారు.ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి వై.ఆగ్నేష్ మాట్లాడుతూ దసరా కానుకగా పెండింగ్ డీఏలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు మాట్లాడుతూ ఇంటర్ జిల్లాల బదిలీలను డీఎస్సీ-2025 నియామకాల కంటే ముందే పూర్తి చేయాలని, ఉపాధ్యాయుల బోధనేతర పనులను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు దుర్గాప్రసాద్, సాయి శివరావు, నాగేశ్వరరావు, ఎన్వీ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, వాసు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీఎన్జీవో
నగర అసోసియేషన్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగుల సమస్యలపై త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఏపీఎన్జీవో నగర అసోషియేషన్ కార్యవర్గం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ చైర్మన్‌గా కమిటీ వేయాలని కోరగా కలెక్టర్ దీనిపై త్వరలో సమివేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వేణుమాధవరావు తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మీసాల మాధవరావు, రాఘవరావు, రాజేష్, రోజారాణి, సత్యమూర్తి, సీహెచ్ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





మాట్లాడుతున్న ఆర్డీవో రాణిసుస్మిత, ఆనంద తీర్థాచార్యులు

అక్టోబరు 27న గోదావరి మాతకు మహా నీరాజనం

కొవ్వూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అక్టోబరు 27వ తేదీన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గోదావరిమాతకు మహా నీరాజనం వైభవోపేతంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు టీటీడీ. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనందతీర్థాచార్యులు తెలిపారు.కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం కార్తీక గోదావరి నీరాజనం ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షించారు. కార్తీకమాసం సోమవారం గోష్పాదక్షేత్రంలో టీటీడీ నుంచి తీసుకువచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వివిధరకాల పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అఖండ గోదావరిమాతకు మహానీరాజనం అందజేస్తామన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ గోదావరి మహానీరాజనానికి అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు.



జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కీర్తి చేకూరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టుఆవరణలో శుక్రవారం సాయంత్రం జిల్లా జడ్జిని కలిసి మొక్కను అందించారు.జిల్లాకు సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు.



న్యాయం కావాలి!

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ)ఆధ్వర్యంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు.ఐఎల్ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ , రాజమహేంద్రవరం బార్ అధ్యక్షుడు కొత్తూరి ఆనందకుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఈ నిరసనలో సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



లేఖర్ల పెన్‌డౌన్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేసి నిరసన ప్రదర్శన చేశారు. రాజమహేంద్రవరంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు.2.0 రిజిస్ట్రేషన్ విధానం వల్ల ప్రజలు, దస్తావేజు లేఖర్లకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లేఖర్ల జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, కోలా రామచంద్రరావు పాల్గొన్నారు.



పెద్ద ప్లానింగే!

అంతస్తుల్లో అధనపు మడత

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

అక్రమ నిర్మాణాలు అధికారుల కళ్లకు కనిపించవు. కాసులు వారి కళ్లకు గంతలు కట్టేస్తాయి. వాణిజ్య భవనాలు/సముదాయాల విషయంలో కిక్కురుమనడంలేదు.అందుకే మూడు నిర్మాణాలు ఆరు కాసులు అనే చందంగా సాగి పోతున్నాయి. అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తుల భవనాలకు బీపీఎస్ వరంగా మారింది. అదనపు అంతస్తుల క్రమబద్ధీకరణపై యజమానుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. అధికారులు మాత్రం అదనంగా అవకాశాన్ని అందిపుచ్చుకొనే 'ప్లానింగ్' చేశారు. ఈ అంతస్తుల మడతపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

ఉమ్మడి తూర్పులో ఎన్నో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్లు, అమలాపురం మునిసిపాలిటీ. ఉమ్మడి జిల్లాలో 9 మునిసిపాలిటీలు, రెండు మునిసిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో రాజమహేంద్రవరం ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉంది. గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు పెద్దగా ఉండవు. కానీ నగర పంచాయతీలు, నగర పాలక సంఘాలు, మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో అయితే మరీ ఎక్కువ సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటారు. ఉమ్మడి జిల్లాలో గ్రామాలను మినహాయిస్తే కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురాల్లోని 2.5 లక్షలకుపైగా భవనాలు ఉండగా వాటిలో 50 శాతం వాణిజ్య భవనాలు /అపార్టుమెంట్లు ఉంటాయి. వీటిలో చాలా వరకూ అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు సమాచారం. మూడేళ్ల కిందట అక్రమ అంతస్తుల విషయంలో నోటీసులు జారీ చేశారు. తర్వాత వందల కొలదీ నిర్మాణాలు జరిగాయి. వాటికీ నోటీసులు ఇస్తున్నామని అధికారులు చెప్పడమే గానీ ఒరిగింది ఏమిటనేది టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎప్పుడూ పెద్ద ప్రశ్నే. ఉదాహరణకు రాజమహేంద్రవరం నగర పాలకసంస్థ పరిధిలో మూడేళ్ల కిందట 150 అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు. అంతకు పదింతలు అక్రమ అంతస్తులు ఉంటాయనే విషయం బహిరంగ రహస్యం. ఆ నోటీసుల్లో కూడా ఎక్కువగా చిన్న వాళ్లే ఉన్నారు. ఆ నోటీసుల సంగతి ఏమైందో ఇప్పటికీ తెలియదు. ఆరోపణలు ఉన్న వాళ్ల కొందరు టౌన్ ప్లానింగ్‌కి బాధ్యులుగా ఉండడంతో 'యథా రాజా తథా ఉద్యోగి' అనే చందంగా పరిస్థితి తయారైంది. ప్రభుత్వం క్రమబద్ధీకరణ నిర్ణయంతో వీళ్లంతా దాదాపుగా ఎగిరి గంతేసినంత పని చేశారు. అధికారులు మాత్రం యథావిధిగా కాసుల వేట 'ప్లానింగ్' చేసేశారు. అసలు ఉమ్మడి తూర్పులో ఎన్ని భవనాల్లో అక్రమంగా అంతస్తులు నిర్మించారో కూడా లెక్క పక్కాగా లేకపోవడం గమనార్హం.

అంతస్తుల మడత ఇలా

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఆగస్టు 31కి పూర్తి చేసుకున్న భవనాలు/అపార్టుమెంట్లకు మాత్రమే బీపీఎస్ వర్తిస్తుంది. దీంతో ఆ తేదీకి ముందు నిర్మాణం పూర్తి చేసుకున్నట్లు పాత తేదీలను వేసి మేనేజ్ చేస్తున్నారు. ఈ మేరకు బీపీఎస్‌కి, అదపు అంతస్తు నిర్మాణంలో విషయంలో కళ్లు మూసుకోడానికి వేర్వేరుగా వసూళ్లు చేస్తున్నారు.

కట్టేయండి.. ఇచ్చేయండి..



బీపీఎస్ కింద క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం ఫీజుల మాట ఎలా ఉన్నా.. ఇంత అంటూ టౌన్/సిటీ ప్లానింగ్, కొందరు కమిషనర్లు నోటిమాట ధరలు పెట్టేసుకున్నారు. 100 మీటర్ల లోపు విస్తీర్ణంలోని భవనాల్లో అదనంగా నిర్మించే ఒక్కో అంతస్తుకు రూ.1-2 లక్షలు, 300 వరకూ ఉంటే రూ.3-4 లక్షలు, 500 వరకూ రూ.4-6 లక్షలు, అపార్ట్‌మెంట్ అయితే ఏకంగా ఫ్లోరుకు రూ.10-15 లక్షలు ముడుపులు పుచ్చు కుంటున్నారు. ఉమ్మడి తూర్పులో రాజమహేం ద్రవరం, కాకినాడలో.. ప్రధానంగా రాజమహేం ద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో అపార్టుమెంట్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. నిర్మాణంలో ఉన్నవే వందకుపైగా ఉంటాయి. ఇప్పుడు వాటికి ఫ్లోర్లు అదనంగా నిర్మించుకోవడానికి ఎలాంటి ప్రక్రియా లేకుండా బీపీఎస్ కింద ఫీజు చెల్లించి, అధికారులకు అనధికార ఫీజు చెల్లిస్తే పనైపోతుంది.ఆ ఫ్లోరులో ప్లాట్లు నిర్మించి ఎంచక్కా అమ్మేసుకోవచ్చు. నగరపాలక సంస్థల ను అనుకొని ఉన్న పంచాయతీల పరిధిలో కూడా ఈ తంతు సాగుతోంది.

అక్రమాలకు తెరతీశారు..

స్థానిక సంస్థల నుంచి అనుమతులు తీసు కున్న వాటికంటే అదనంగా చేపట్టిన అంతస్తుల (నిర్మాణాలు)ను బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్) కింద క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.ఇదే అదనుగా ఇప్పటికే నిర్మిస్తున్న భవనాల్లో అక్రమంగా నిర్మాణాలకు తెరతీశారు.అధికారులకు కాస్త ఎక్కువగా చేయి తడిపితే పాత తేదీలతో గట్టెక్కిస్తారనే గ్యారంటీ ఉండడంతో ఇటీవల అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సక్రమంగా ఉంటే వచ్చే మామూలు కంటే అక్రమ నిర్మాణా లకు అదనంగా ఉంటుందని కొన్ని చోట్ల అధికా రులే ఐడియా ఇచ్చి అక్రమ అంతస్తులకు చేయూతనిస్తున్నారని తెలుస్తోంది. ఈ తంతు నడపడానికి కిందిస్థాయి సిబ్బందిని నియమిం చుకోగా బాగానే దండుకుంటున్నారని చెబుతున్నారు.

- పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు
- సహకరిస్తున్న అధికారులు
- చూసీచూడనట్టు వదిలేసి
- ఇష్టారాజ్యంగా నొక్కుడు
- ప్రతిదానికి పక్కాగా రేటు
- జేబు నింపుకుంటున్న ప్లానింగ్
- వేల సంఖ్యలో భవనాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- భారీగా ముడుపులు
- వరంగా మారిన బీపీఎస్

బీపీఎస్‌కు 4న కేబినెట్ ఆమోదం

బీపీఎస్‌ని ఈ నెల 4న కేబినెట్ ఆమోదించింది. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి నిర్మాణాలు పూర్తయిన వాటికి ఈ వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతకుముందే దీనిపై ఉప్పందడంతో రెండు నెలల ముందు నుంచీ అక్రమ నిర్మా ణాలు విపరీతంగా జరుగుతున్నాయి. సాధార ణంగా సామాన్యుడి ఓ ఇంటి నిర్మాణ అను మతికి దరఖాస్తు చేస్తే ఆ ఫైలు కదలడానికి ముక్కుతూ మూలుగుతూ ఉంటుంది. కానీ అదనపు అంతస్తుల క్రమబద్ధీకరణ ఫైళ్లు మాత్రం దూసుకుపోతున్నాయి. ఉమ్మడి తూర్పులోని రాజమహేంద్రవరంలోనే ఎక్కువగా బీపీఎస్ కిందకు వస్తున్న అంతస్తులు ఉండడంతో సిటీ ప్లానింగ్ అధికారుల పంట పండుతోందని ఆ శాఖలో చర్చ నడుస్తోంది.

అసెంబ్లీలో మన వాణి!







అసెంబ్లీ వర్షాకాల సమావేశంలో రెండో రోజు శుక్రవారం మన ఎమ్మెల్యే తమ వాణి వినిపించారు.. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అసెంబ్లీలో మాట్లాడారు.. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీఎంను కలిసి సమస్యలు విన్నవించారు.

పెద్దేవంలో పశువులు మృత్యువాత

కొవ్వూరు, సెప్టెంబరు 19(ఆంధజ్యోతి): తాళ్లపూడి మండలం పెద్దేవంలో పాడి పశువులు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతున్నాయని.. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి పాడి రైతులను ఆదుకోవాలి. కొవ్వూరు నియోజకవర్గంలో పశుసంవర్ధకశాఖకు భవనాలు, డాక్టర్లు, సిబ్బంది కొరత అధికంగా ఉంది. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి పాడి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి. దీనిపై స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పశుసంవర్ధకశాఖలో ఖాళీలను భర్తీ చేస్తాం. 6137 మంది వెటర్నరీ అసిస్టెంట్స్ ఉన్నారు. ఎక్కడా పశు వైద్యానికి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశాం. 434 కొత్త ఆసుపత్రులు, మరమ్మతులకు గురైన ఆసుపత్రులకు మరమ్మతులు చేయడానికి నాబార్డుకు ప్రతిపాదనలు పంపాం.

- ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు

జీఎస్టీ 2.0 సూపర్ ఆలోచన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పన్నుల మినహాయింపులపై ఎప్పటికప్పుడు సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు కేంద్రానికి సూచనలు చేయడం రాష్ట్రానికి గర్వకారణం. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు జీఎస్టీ 2.0 ఎంతగానో దోహదం చేస్తుంది. దేశంలో అస్తవ్యస్తంగా ఉన్న పన్నుల వ్యవస్థను సంస్కరించి జీఎస్టీ విధానాన్ని తీసుకొచ్చి ప్రధాని మోదీ గొప్పవిధానానికి నాంది పలికారు..ఇప్పుడు మరిన్ని సంస్కరణలతో 2.0 తీసుకురావడం అభినందనీయం. ఈ విధానంపై దేశంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత అవసరమైన వస్తువులు, ఆరోగ్యం, విద్య సంబంధిత వస్తువులకు జీరో రేటుకి తీసుకురావడం అదే సమయంలో లగ్జరీ గూడ్స్‌కి పన్ను పెంచడం అభినందనీయం.

- ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం

గత పాలనలో అవినీతిపై విచారణ జరిపించాలి

దివాన్‌చెరువు/కోరుకొండ, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీఎం చంద్రబాబునాయుడును కోరారు. అమరావతిలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే బత్తుల శుక్రవారం కలిసి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై చర్చించినట్టు చెప్పారు. 586 ఎకరాల ఆవభూముల కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని టీటీడీ దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. కోరుకొండ రంగనాథస్వామి ఆలయం పునర్నిర్మించాలని, పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములో భూములు కోల్పోయిన 92 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం

ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ వినతులు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ తదితర కేసుల కారణంగా సస్పెండ్ అయిన ఉద్యోగులపై విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఉద్యోగుల సమస్యలపై 28 వినతులు స్వీకరించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేం దుకు కృషి చేస్తామన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే కేసుల్లో ప్రధాన శిక్షలు ,తక్కువ ప్రాముఖ్యత ఉంటే చిన్న శిక్షలు విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.



జక్కంపూడి రాజా ఇంటి వద్ద వైసీపీ నాయకుల నిరసన ప్రదర్శన

గ్రూపులుగా వైసీపీ చలో మెడికల్ కాలేజీ

రాజమహేంద్రవరం/అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ చలో మెడికల్ కాలేజీకి కార్యక్రమంలోనే వైసీపీ గ్రూపులతో వ్యవహరించడం ఆ పార్టీ పరిస్థితికి అద్దంపడుతోంది. రాజమహేంద్రవరం వైసీపీలో రెండు గ్రూపుల వ్యవహారం మళ్లీ రోడ్డెక్కింది. చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి మాజీమంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇచ్చిన పిలుపులో జక్కంపూడి రాజా ఇంటి నుంచి శుక్రవారం ఉదయం 9 గంటలకు చలో మెడికల్ కాలేజి మొదలవుతుందని ఉంది. మాజీ ఎంపీ మార్గాని భరత్ వర్గం క్వారీమార్కెట్ నుంచి ఉదయం 9 గంటలకు ఛలో మెడికల్ కాలేజి మొదలవుతుందని పిలుపు ఇచ్చారు. పైగా పస్తుతం కాలేజీలో ఫైనల్ పరీక్షలు జరుగుతున్న కారణంగా విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని వైసీపీ నేతలకు పోలీసులు ముందుగానే నోటీసులు ఇచ్చారు.వైసీపీ పార్లమెంటరీ నాయకుడు డా. గూడూరి శ్రీనివాసరావు, అజ్జరపు వాసు తదితరులు కొంత మందితో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేసి వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటి వద్ద రోడ్డుపై మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు సూర్యానారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, రౌతు సూర్యప్రకాశరావు, డా.గూడూరి శ్రీనివాసరావు, మేడపాటి షర్మిళారెడ్డి, జక్కంపూడి గణేష్, నందెపు శ్రీనివాస్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. చివరకు ఎవరూ మెడికల్ కాలేజీ వరకూ చేరకుండా నిరసన ముగిసింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. వైసీపీ శ్రేణుల నుంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను చేపట్టారు. డీఎస్పీ భవ్యకిషోర్ మెడికల్ కాలేజీ వద్దకు చేరుకుని భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. త్రీ టౌన్ సీఐ వి.అప్పారావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ మంగాదేవి, పలువురు ఎస్ఐలు, సిబ్బందితో మెడికల్ కాలేజీ వద్ద పహారా ఉన్నారు. డ్రోన్ కెమెరాను మెడికల్ కాలేజీ పరిసరాల్లో ఎగుర వేసి పరిస్థితిని పోలీసు అధికారులు సమీక్షించారు. చివరకు వైసీపీ శ్రేణులు మెడికల్ కాలేజీ వద్దకు రాకపోవడంతో భద్రత ఉపసంహరించారు.



గేదెలకు.. ఆ వ్యాధేంటో!

పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధి

రాజమహేంద్రవరం/తాళ్లపూడి/కొవ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాడి గేదెలకు ఆ వ్యాధేంటో.. ఉన్నట్టు ఉండి తిండితినడం మానేస్తున్నాయి. కుప్పకూలిపోతున్నాయి. వాస్తవానికి గత నెల 24న నుంచి అంతుచిక్కని వ్యాధితో 10 పాడి గేదెలు మృతిచెందాయి. మరో 22 గేదెలకు వ్యాధి లక్షణాలు ఉన్నాయి. అందులో మరో 15 వ్యాధి సోకిన గేదెలను అమ్మేశారు. మరో ఏడు గేదెలకు చికిత్స చేస్తున్నారు. ఇదీ కొవ్వూరు నియోజకవర్గం పరిధి తాళ్లపూడి మండలం పెద్దేవంలో పరిస్థితి.. ప్రస్తుతం అది కొవ్వూరు మండలంలోని పంగిడి గ్రామానికి పాకింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పశువైద్యులు అప్రమత్తమయ్యారు.



నీటి నమూనాలు సేకరణ

పెద్దేవం గ్రామంలో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. గేదెల వరుస మరణాల దృష్ట్యా పెద్దేవం గ్రామానికి వచ్చిన కలెక్టరు చేకూరి కీర్తి గ్రామంలో ఎక్కడెక్కడ గేదెలు తాగుతున్నాయో అక్కడ ఉన్న నీటని పరీక్షించాలని ఆదేశాలిచ్చారు.దీంతో అధికారులు ఆయా ప్రదేశాల్లో నీటిని సేకరించి పరీక్షలు చేపట్టారు.

జిల్లాలో అప్రమత్తం

పెద్దేవంలో గేదెలు మృతి, పంగిడిలో రెండు గేదెలకు వ్యాధి లక్షణాలు కనిపించడంలో జిల్లా అంతటా అప్రమత్తం చేశారు. పెద్దేవంలో 10 గేదెలు మృతి చెందగా, 15 గేదెలకు వ్యాధి సోకిన సంగతి తెలిసిందే. కానీ అక్కడ రైతులు వ్యాధి సోకిన వాటిని కోతకు అమ్మేసినట్టు సమాచారం. వీటి మాంసాన్ని గొడ్డు మాంసం వ్యాపారులు యథేచ్ఛగా అమ్మేస్తుండడం గమనార్హం. అసలు ఈ వ్యాధి లక్షణాలేంటో తేలకుండా గేదెల మాంసం తినడం ప్రమాదకరమే! అందువల్ల వ్యాధి సోకిన గేదెలు అమ్మడం కొనడం చేయకూడదు. వాటి మాంసాన్ని తినడం మంచిది కాదు. ఇదిలా ఉండగా కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో ఇంటింటా సర్వే చేస్తున్నారు. పెద్దేవంలో 360, పంగిడిలో 300 వరకూ గేదెలు ఉన్నాయి. జిల్లాలో లక్షా 69 వేల గేదెలు, 76 వేల ఆవులు, 2లక్షల 41వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఈ మేరకు జిల్లాలోని పశువైద్యశాఖ అధికారులను అప్రమత్తం చేసి ఎక్కడ ఈ లక్షణాలు కనిపించినా సమాచారమివ్వాలని చెబుతున్నారు.గేదెలు మురుగు నీరు తాగకుండా చూసుకోవాలంటున్నారు. రైతులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పెద్దేవంలో సుగంధి చెరువు వినియోగంలో లేదని పేర్కొన్నారు.

- ఆగని గేదెల మరణాలు
- ఇప్పటి వరకూ 10 మృతి
- మరో 15 గేదెలకు లక్షణాలు
- గత నెల 24 నుంచి వ్యాధి
- అయినా కనిపెట్టలేని వైనం
- నీటి నమూనాలు సేకరణ
- పంగిడిలో రెండు గేదెలకు



గేదెల మెడపై తెల్లటి మచ్చలు వస్తే అంతే..

పాడి గేదెల మెడఎడమ వైపు చెవికి మధ్య తెల్లటి మచ్చలు రావడం,గూబ వాచిపోవడం, ఆహారం మానేయడం, కుప్పకూలడం.. ఇవీ లక్షణాలు..ఆగస్టు 24న ఆ లక్షణాలతోనే యండపల్లి విష్ణు మూర్తి గేదె ఆకస్మికంగా మృతి చెం దింది. తర్వాత అదే ఊరిలో పలు గేదెలకు ఇటువంటి లక్షణాలు కనిపించ డంతో రైతులు వైద్యులను సంప్రదించారు. చికిత్స అందించినా 9 గేదెలు మృత్యువా తపడ్డాయి. దీంతో జిల్లా పశువైద్యశాఖ అప్రమత్తమైంది. వైద్యులు గేదెల రక్తం, పేడ, గడ్డి, దాణా, నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపగా పేడ పరీక్షలో బి.కోలి, పొట్ట జలగ వ్యాధి లక్షణాలు ఉన్నట్టు నిర్ధారిం చారు. కానీ వాటికి సంబంధించిన మందులు వాడినా పెద్దగా స్పందన లేదు. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట మరో గేదె మృతిచెందింది. ఈ గేదెకు అక్కడే పోస్టుమార్టం చేయగా పొట్ట,కాలేయం లోనూ జలగలు ఉన్నట్టు గుర్తిం చారు. దీంతో వాటి రక్తంతో పాటు మెడ వద్ద మచ్చభాగంలోని కండను , పేడ, ఇతర అవయవాలను విజయవాడకు చెందిన వీబీఆర్ఐ ల్యాబ్ నిపుణు లు తీసుకెళ్లారు.వాటి రిపోర్టు రావడానికి రెండు మూడు రోజులు పడుతుం దని పశుసంవర్ధక శాఖ జేడీ టి. శ్రీనివాసరావు తెలిపారు. తన 30 ఏళ్ల సర్వీసులో ఇటువంటి వ్యాధిని చూడలేదని ఆయన చెప్పడం గమనార్హం.

మూడు గేదెలు చనిపోయాయి..

నాకు నాలుగు గేదెలు ఉన్నాయి. సుగంధి చెరువు సమీపంలో కడతా. నా గేదెలన్నింటికీ వ్యాధి సోకింది. మూడు గేదెలు చనిపోగా ఉన్న ఒక్క గేదెను కాపాడుకోవడానికి వేలాది రూపాయలు మందులకు ఖర్చు చేశా.అయినప్పటికీ గేదె నిలబడడం లేదు. పడుకునే ఉంటుంది. నీళ్లు తాగదు, తిండి తినదు..నీరసించి పోతుంది. ఎప్పుడు చనిపోతుందో తెలియదు.

- జమ్ములు శ్రీను, రైతు, పెద్దేవం

ఒక గేదె చనిపోయింది..

నాకు రెండు గేదెలు ఒక ఆవు ఉన్నాయి. నా గేదెలను ఎక్కడికీ తీసుకెళ్లను.వాటిని ఇంటి వద్దనే మేం తాగే నీళ్లే వాటికి పెడతాం. అయినా ఒక గేదె వ్యాధి సోకి చనిపోయింది. ఉన్న గేదెకు, ఆవుకు ఈ రోజు వాటి పొట్టలో ఏమైనా జలగలు గానీ నత్తలు గానీ ఉంటే చనిపోవడా నికి మందులు వేశారు.ఆవుకు మాత్రం ఏ విధమైన వ్యాధి సోకలేదు.

- జొన్నలగడ్డ సత్యనారాయణ, రైతు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొవ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐ. పంగిడి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పంగిడి వాటర్‌వర్క్సు ఫీడర్ వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదలచేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఆరోజు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీఎంను కలిసిన బూరుగుపల్లి



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

నిడదవోలు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సీఎం కార్యాలయంలో సీఎం చంద్రబాబును నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు శుక్రవారం కలిశారు. ఈసందర్భంగా నిడదవోలు నియోజక వర్గంలోని పలు అభివృద్ధి అంశాలకు సంబంధించి చర్చించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనుల గురించి సీఎంకు వివరించారు.

రెండోరోజూ వీఆర్ఏల ధర్నా



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

కొవ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవిన్యూ సహాయకులు రెండోరోజైన శుక్రవారమూ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు వర్ధనపు గంగయ్య మాట్లాడుతూ గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద డివిజన్ స్థాయిలో జరిగే ధర్నాలో తొమ్మిది మండలాల నుంచి వీఆర్ఏలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం సెక్రటరీ టి.సతీష్, కోశాధికారి కె.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు కొత్త ఈ పోస్ యంత్రాల పంపిణీ



యంత్రాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో

కొవ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో 65 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఇంటి వద్దనే రేషన్ అందజేస్తున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. శుక్రవారం కొవ్వూరు డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్లకు కొత్త ఈపోస్ యంత్రాలను పంపిణీ చేశారు. పాత యంత్రాలు తరచుగా మొరాయించడంతో కొత్తవి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ మిషన్లు జియో కంపెనీ సిమ్ నెట్‌వర్కుతో పనిచేస్తాయన్నారు. తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సీఎస్‌డీటీ సునీత, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందించాలి



చాగల్లులో యంత్రాలు అందిస్తున్న తహశీల్దార్ మెరికమ్మ

చాగల్లు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద ప్రజలకు అందించే రేషన్ సరుకులు సకాలంలో అందించాలని తహశీల్దార్ ఎం. మెరికమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు స్మార్ట్ ఈ పోస్ యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులతో సరుకుల పంపిణీ ఏవిధంగా జరుగుతుంది అన్నది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి



ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా క్రమం తప్పకుండా పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మితను కలిసి వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ నాయకుడు జే.రాంబాబు మాట్లాడుతూ ప్రతినెలా 30వ తేదీ, ఫిబ్రవరి 28వ తేదీల్లో ప్రొటక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ డేను జీవో 28 ప్రకారం నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎం.సుందరబాబు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

• నిలిచిన రిజిస్ట్రేషన్లు
• ప్రభుత్వ ఆదాయానికి గండి

కొవ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటి, భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లలో కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ జఠిలమవుతూ తీవ్ర జాప్యానికి గురవుతుందని దస్తావేజు లేఖర్లంతా శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీన్ని నిరసిస్తూ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి వచ్చిన యజమానులు తమ ఆధార్ ఓటీపీ చెప్పడం వల్ల బ్యాంకు డేటా చోరీకి గురై సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సాదా రామకృష్ణ, రవికిషోర్, మారిశెట్టి సతీష్, మురళీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

నిడదవోలు: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డు 2.0 సాఫ్ట్‌వేర్‌లో లోపాల కారణంగా ప్రజలకు తీవ్ర అసౌ కర్యం కలుగుతోందని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు దస్తావేజు లేఖర్లంతా రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్‌కు పిలుపునిచ్చారని రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం నాయ కుడు వాసా వెంకట సురేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజుల లేఖర్లంతా పెన్‌డౌన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సురేష్ మాట్లాడుతూ శుక్ర, శనివారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్ట నున్నామన్నారు. నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకి సుమారు 50 నుంచి 70 రిజిస్ట్రేషన్లు జరుగుతూ ఉంటా యని, దీనివల్ల ప్రభుత్వానికి రూ. కోటికి పైగానే ఆదాయం వస్తుందన్నారు. అలాంటిది శుక్రవారం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగకపోవ డంతో ప్రభుత్వ ఆదా యానికి గండిపడిందన్నారు. కార్యక్రమంలో బసవ మణికంఠ, చలపతి, త్రిమూర్తులు, ఆచంట సుబ్బా రావు, రాజాజీ, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసనలో దస్తావేజు లేఖర్లు

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం పెన్‌డౌన్ చేశారు. ఈ సందరంగా రైటర్లు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సమయంలో ఓటీపీ విధానం పెట్టడం వల్ల రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నా రు. ఈ కొత్త విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్డు ప్రేమ్ 2.0 విధానంలో సాఫ్ట్‌వేర్ సాంకేతిక లోపాల వల్ల రిజిస్ట్రేషన్లలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. రైటర్ల సంఘ అధ్యక్షుడు గుండా రామకృష్ణారావు, డాక్టర్ కృష్ణ మూర్తి, తదితర రైటర్లు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

దేవరపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. వీఆర్ఏలు వీరరాఘవులు, చిర్రా రాజు, జానీ, నాగు, కిరణ్, తదితరులు మాట్లాడుతూ వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గోపాలపురం పీఏసీఎస్‌లో విజిలెన్స్ తనిఖీలు

గోపాలపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చిట్యాల, గోపాలపురంలో విజిలెన్స్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా ఎరువుల దుకాణాలపై శుక్రవారం విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాలలోని భవాని ఎంటర్‌ప్రైజస్‌తో పాటు గోపాలపురం పీఏసీఎస్ వద్ద ఉన్న ఎరువుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డులకు, భౌతిక నిల్వలకు వ్యత్యాసం ఉండటంతో అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. అలాగే రికార్డులు సక్రమంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ జీ.మధుబాబు, ఎస్‌వీ లక్ష్మీ, నాగార్జున, వ్యవసాయాధికారి ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మాజీ హోంమంత్రి వనితకు నోటీసు

నల్లజర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మెడికల్ కళాశాల వద్ద వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనవద్దని నల్లజర్ల సీఐ బాలశౌరి మాజీ హోంమంత్రి తానేటి వనితకు శుక్రవారం ఉదయం నోటీసులు అందించారు.

శివాలయానికి నాగాభరణం బహూకరణ

దేవరపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కురుకూరులోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి అదే గ్రామానికి చెందిన కొయ్యలమూడి శ్రీరామచంద్రరావు, సుందర మాణిక్యవాణి దంపతుల కుమార్తె సునీత, వారి అల్లుడు పిన్నమనేని శ్రీధర్ దంపతులు శివాలయానికి రూ. మూడు లక్షల 50 వేలు విలువ గల వెండి నాగాభరణాన్ని శుక్రవారం బహూకరించారు. సునీత, శ్రీధర్ దంపతులు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. వీరి కుటుంబం గతంలో ఆలయ నిర్మాణానికి రూ. 30 లక్షలు అందజేసింది. ఈ సందర్భంగా వీరితో ఆలయ పండితులు, ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ యలమాటి భాస్కరరావు, స్థానికులు బేతిన వెంకట్రావు, కలగర రామచంద్రం, కొయ్యలమూడి శ్రీనివాస్, మల్లెల శ్రీనివాస్, కలగర భూపతిరావు, కొయ్యలమూడి వేణు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



కురుకూరులో వెండి నాగాభరణాన్ని అందజేస్తున్న దాత పిన్నమనేని సునీత

ఏపీఎస్ఐడీసీ ఎండీకి ఎమ్మెల్యే ముప్పిడి వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలో ఆరు ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఏపీఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావుకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం విజయవాడలో తిరుమలరావును కలిసి సమస్యను వివరించారు. కొవ్వూరు నియోజకవర్గంలోని కుమారదేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, చాగల్లు, బ్రాహ్మణగూడెం, ధారవరం ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని ఇటీవల నియోజకవర్గంలోని మలకపల్లికి విచ్చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే రైతుల సాగునీటి అవసరాల దృష్ట్యా నిధులు త్వరితగతిన మంజూరు చేసి ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఉండ్రాజవరంలో ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నేతలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులను నిరసిస్తూ ఈనెల 24వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో జరిగే దళిత రణభేరికి హాజరుకావాలని కోరుతూ శుక్రవారం బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నేతలు మర్రి మహాలక్ష్మడు, చల్లాబత్తుల సత్యనారాయణ, బత్తిన ఆశీర్వాదం, డొల్లా జాషువా, నూకపెయ్యిప్రసన్నబాబు, మేళం చంటి, గొల్ల ధనరాజు, రాయుడు సువర్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై పారిశుధ్య కార్మికులకు అవగాహన

చాగల్లు: చాగల్లు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. స్థానిక పీహెచ్‌సీలో వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారిణి తనూజ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికులు మీ ఆరోగ్యంపై కూడా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహ్మద్ ఆలీ పాల్గొన్నారు.



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గ్రామాల్లో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

తాళ్లపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి తల్లి ఆరోగ్యవంతంగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వస్థి నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రక్కిలంక పంచాయతీ వద్ద డాక్టర్ హారికా గుప్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిచారు. వైద్యశిబిరాన్ని స్థానిక నాయకుడు యాళ్ల బాబూరావు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ హారికా గుప్త మాట్లాడుతూ వారం రోజుల పాటు ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలను నిర్వహించి వచ్చిన రోగులకు ఖరీదైన పరీక్షలు చేసి వారికి మందులు కూడా ఉచితంగానే అందిస్తున్నామన్నారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మోర్తలో శుక్రవారం స్వస్థి నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్. ఉషాదేవి పాల్గొని సుమారు 142 మంది స్త్రీలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలకు క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేత కే. సత్యనారాయణ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ హారికా గుప్త

నల్లజర్ల: మహిళల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సిరాజ్ ఉద్దీన్ అన్నారు. స్వస్థి నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగం గా శుక్రవారం చీపురుగూడెంలో మహిళలకు వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మహిళలు తమ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసుల్లో ఉండే పోషకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, గూళ్లపూడి వెంకటరత్నం, ఏఎన్ఎం జగదీశ్వరి, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, కార్యకర్తలు సుశీల, వరలక్ష్మి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడురోజులు జైలు

పెరవలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి తణుకు కోర్టు మూడు రోజులు జైలు శిక్ష విధించింది. పెరవలి ఎస్ఐ ఎం. వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం... పెనుమంట్ర మండలం భట్లమగుటూరికి చెందిన మహాశివభట్టు లక్ష్మీనారాయణరాజు మద్యం సేవించి ఈనెల 17వ తేదీన తన మోటార్‌సైకిల్‌పై వస్తుండగా పెరవలి వద్ద పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో పట్టుబడ్డాడు. దీంతో సదరు వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా శిక్ష విధించినట్టు ఎస్ఐ చెప్పారు. అలాగే కాకరపర్రు పరిధిలో శుక్రవారం పేకాడుతున్న ఐదు గుర్ని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2,280 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

ఆహారంలో..ఆరోగ్యం!

• కిచెన్ కెమిస్ట్రీపై నన్నయలో వర్క్‌షాప్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నిరకాల పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యంతో జీవించవచ్చునని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో మహిళలకు పోషకాహారం (కిచెన్ కెమిస్ట్రీ)పై నిర్వహించిన వర్క్‌షాప్‌లోమాట్లాడారు. ఆరోగ్యానికి అవసరమైన పోషకాలతో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఈ విషయంలో శ్రద్ధ వహించాలని చెప్పారు. మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవడమే లక్ష్యంగా ఈసదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రాయల్ సొసైటి ఆఫ్ కెమిస్ట్రీ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.వీసపాటి మాట్లాడుతూ మన ఇంట్లో ఉండే వంటగది పదార్థాలతోనే రసాయన శాస్త్ర సూత్రాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకోవడం, వంటచేసేటప్పుడు కలపడం, వేడిచేయడం , చల్లబరచడం వంటి చర్యలు ద్వారా పదార్థాలు ఎలా మారతాయో తెలపడమే కిచెన్ కెమిస్ట్రీ అన్నారు. కిచెన్ కెమిస్ట్రీలోని వివిధ అంశాలను వివరించి సహజాహారం పోషకవిలువలపై అవగాహన కల్పించారు. అలాగే పి.వి.లక్ష్మి చాక్లెట్ తయారీపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. అనంతరం మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాల ప్రదర్శన పోటీలో విద్యార్థులు డ్రైఫ్రూట్స్ మిక్చర్, సున్నుండలు తదితరాలను సిద్ధం చేశారు. అతిథులు, న్యాయనిర్ణేతలు వాటిని రుచి చూసి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహన రెడ్డి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులు తయారుచేసిన ఆహారాన్ని రుచి చూస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

ఆరోగ్యాన్నిచ్చే..రూట్ వెజిటేబుల్ బౌల్..

బీట్‌రూట్ , క్యారట్, పెరుగు, ఆవాలు, కరివేపాకు, జీలకర్ర ఉపయోగించి తయారుచేసే ఈ రూట్ వెజిటేబుల్ బౌల్‌తో ఎన్నో ఆరోగ్యప్రయోజనాలుయి. బీట్‌రూట్‌ని 10 నిమిషా లు ఉడకబెట్టాలి. ఆ తరువాత మరో 10 నిమిషాల పాటు చల్లార్చి తురుముకుని ఒక పాత్రలో వేసుకుని తగినంతపెరుగుతో బాటు కొంచెంఉప్పు, మిరియాలపొడి వేసి బాగా కలుపుకుని దానికి తాళింపును జతచేయాలి. ఈ బీట్‌రూట్ మిశ్రమాన్ని ఒక బౌల్‌లో వేసుకుని కొత్తిమీరతో అలంకరించుకోవాలి.



కె.ప్రియాంక, ఎన్.జ్యోతిర్మయి, ఎంఎస్సీ విద్యార్థినులు

పోషకాలుండే.. సొరకాయ అప్పాలు



వరిపిండి, సొరకాయ, నువ్వులు, పచ్చిమిరపకాయలు,ఉప్పు నూనెను ఉపయోగించి సొరకాయ అప్పాలు చేశాం.సొరకాయని ముందుగా తురుముకుని వేయించాలి. నువ్వులను బాగా దోరగా వేయించి ఈ రెండింటినీ వరిపిండిలో వేసి ముద్దగా కలుపుకని నూనెలో వేయించాలి. వీటిలో ఐరన్, కార్బోహైడ్రేడ్స్, ప్రొటీన్లు, కేలరీస్ వంటి పోషక విలువలు ఉంటాయి. వీటిని టమోటా చట్నీతో కలుపుని తింటే రుచికరంగా ఉంటాయి.

\- కె.దుర్గాదేవి, ఎస్‌కేడీ.భవాని, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ

ఎముకలకు బలం.. స్టఫ్డ్ బీరకాయ



ఆహారంతో ఆరోగ్యం లభిస్తోంది.. మన పూర్వీకులు వందేళ్ల బతకడమే అందుకు ఉదాహ రణ. సరిగా వండుకుంటే ప్రతి కూర ఔషధమే. బీరకాయతో తయారు చేసిన ఈ వంటకంలో వాడేపదార్థాల వల్ల కాల్షియం ఉండి ఎముకలకు బలాన్నిస్తుంది. బీరకాయ,నువ్వులు, వేరుశనగ గుళ్ళు ధనియాలు, జీలకర్ర, నెయ్యిని ఈ వంటకం కోసం వాడా. ఈ వంటకం తినడం వల్ల శరీరానికి కార్బోహైడ్రేట్లు, విటమిన్ బి1, బి2 , బి5, బి6, ఇ, కె లభిస్తాయి.చాలా ఆరోగ్యకరమైనది..

\- పి.స్నేహ. సివిల్ ఇంజనీరింగ్

వచ్చే నెల 1 నుంచి రాజమండ్రి-తిరుపతి విమాన సర్వీసు

• ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీకాంత్ వెల్లడి

కోరుకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి విమానాశ్రయం నుంచి దేశంలోని ప్రధాన నగరాలకు విమాన సర్వీసులు ఇప్పటికే నడుస్తున్నాయని... అక్టోబరు ఒకటో తేదీ నుంచి రాజమండ్రి-తిరుపతి మధ్య విమాన సర్వీసు ప్రారంభమవుతుందని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎస్‌కే శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు వారానికి మూడురోజులు అందుబాటులో ఉంటుందన్నారు. ఏటీఆర్ 72 విమానం తిరుపతిలో ఉదయం 7.40 గం టలకు బయల్దేరి 9.25 గంటలకు రాజమండ్రి చేరుతుం దన్నారు. ఇక్కడ 9.50 గంటలకు బయల్దేరి 11.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ సర్వీసు ప్రారంభానికి కావాల్సిన ఏర్పాట్ల పరిశీలన కోసం ఎయిర్‌లైన్స్ బృందం త్వరలో రాజమండ్రి విమానాశ్రయానికి రానుందని శ్రీకాంత్ వెల్లడించారు.

NOTICE TO SHOW CAUSE (GENERAL FORM)
Notice U/O. 5 Rule 20 C.P.C.In the Court of the Civil Judge, Sr. Divn., Berhampur
C.M.A. No.3 & 4/2022 (in T.S. No.103/2001)

M. V Raju (died)
His LRs. M. Usha Rani and others ....Petitioners
Vrs.
M.V. Satyanarayana Rao & others ....Respondents
To
R 3(a): Marella Nagesh Kumar, S/o. Late M. Venkateswar Rao, Residing C/o. P.S.N. Murty, Retd. Executive Officer, near Post Office, Sarada Nagar, AT/PO: Narsipatnam, Visakhapatnam District.(A.P.)
Re 3(b):Marella Dinesh Kumar, S/o. Late. M. Venkateswar Rao, C/o. P.S.N. Murty, Retd. Executive Officer, Nr.Post Office, Sarada Nagar AT/PO: Narsipatnam, Visakhapatnam Dist. AP.
R3(c):Marella Uma Devi, D/o. Late M. Venkateswar Rao, Residing C/o. P.S.N. Murty Retd. Executive Officer near Post Office, Sarada Nagar, AT/PO: Narsipatnam, Visakhapatnam, A.P.
R. 5. Marella Tirumala Rao, S/o. Late M.V. Brahmananda Rao Permanent resident of vill: Jagannathpur, PO: Girisola, AT/PO: Ganjam Dist. At present working as Typist C/O.Punjiyada Ltd. AT/PO: Rajmundary, Eluru-534001 S. Godavari Dist. AP.
R. 7. Smt. D. Seeta Devi, W/o. D. Syama Sundar, Residing at Door No.49-23-21, Muruti Nivas, Lalite Nagar AT/PO: Visakhapatnam Dist. AP.

Whereas the above named petitioners Smt. Usha Rani and others made applications for restoration of the suit T.S. No. 103/2001, U/O 9 R 9 C.P.C. and for condonation of delay U/S. 5 Limitation Act. You are hereby warned to appear in this court in person or by a pleader duly instructed on 18-10-2025 at 10.30 O' Clock in the forenoon, to show cause against the application, failing wherein the said application will be heard and determined ex-party.

Given under my hand the seal of the court 10th day of September, 2025
CIVIL JUDGE, SR.D., BERHAMPUR